RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 53 శనివారం, మార్చి 23, 2024 పేజీలు : 4

## బిజెపికి బీటీమ్ లీడర్ గా రేవంత్ రెడ్డి తీరు: హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ మద్యం కేసులో కాంగ్రెస్ హైకమాండ్ ది ఒకదారి.. రేవంత్ ది మరోదారి అన్నట్లు ఉందని హరీశ్ రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బిజెపికి బీ టీమ్ గా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ తీరుకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని తెలిపారు. ఖర్గే, రాహుల్ నాయకత్వంలో రేవంత్ రెడ్డి పనిచేయడం లేదని, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు.

## జైలులో ఉన్నా సరే...

# నా జీవితం దేశానికే అంకితం

## : కేజ్రీవాల



న్యూఢిల్లీ మార్చి, 22 : ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ తాను జైలులో ఉన్నా లేదా బయట ఉన్నా తన జీవితం దేశానికే అంకితం అని శుక్రవారం ప్రకటించారు. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం కేజ్రీవాల్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరచింది. ఎక్సైజ్ విధానంతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీకి పది రోజుల కస్టడీని ఇడి కోరింది. 'నేను (జైలు) లోపల ఉన్నా, బయట ఉన్నా నా జీవితం దేశ సేవకే అంకితం' అని కేజ్రీవాల్ తనను కోర్టులో హాజరు పరుస్తున్నప్పుడు ఒక 'టివి9 నెట్‌వర్క్' చానెల్‌తో చెప్పారు. ఇడి గురువారం రాత్రి అరెస్టు చేసిన తరువాత కేజ్రీవాల్ చేసిన తొలి వ్యాఖ్య ఇది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా నిరోధించేందుకు పన్నిన 'రాజకీయ కుట్ర'గా ఆయన అరెస్టును ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విమర్శించింది. కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో బిజెపికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనకు ఆప్ పిలుపు ఇచ్చింది. ఢిల్లీ క్యాబినెట్ మంత్రులు ఆతిషి, సౌరభ్ భారద్వాజ్, తూర్పు ఢిల్లీ లోక్‌సభ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌తో సహా పార్టీ నేతలు పలువురిని ఐటిఒ వద్ద నిరసన సందర్భంగా పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు.

# కాంగ్రెస్ 'ఆపరేషన్ గ్రేటర్'



హైదరాబాద్ మార్చి, 22 : హైదరాబాద్ పరిధిలోని మూడు ఎంపీ సీట్లను ఎట్టి పరిస్థితుల్లో గెలవాలని కాంగ్రెస్ గట్టిగా ప్రయత్నాలు చేస్తోంది. అందుకే తగ్గట్లే.. ఆపరేషన్ గ్రేటర్ పేరుతో ముందుకు వెళ్తోంది హస్తం పార్టీ. చేవెళ్ల, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఈ మూడు సీట్లలోనూ.. బీఆర్ఎస్ నుంచి చేరి వారికే టికెట్లు కేటాయించింది. ఆర్థిక బలంతో పాటు, ప్రజాబలం ఉన్న వారిని పార్టీలో చేర్చుకుని.. మూడు ఎంపీలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. ఇందులో భాగంగా.. గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేల తోనూ మంతనాలు జరుపుతున్నారు కాంగ్రెస్ నేతలు. తాజాగా మేయర్, గ్రేటర్ కార్పొరేటర్లపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి సహా 10మందికి పైగా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా.. మరో 13మంది హస్తం గూటికి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. కార్పొరేటర్లే కాదు.. GHMC మేయర్ గద్వాల విజయలక్ష్మిని చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది కాంగ్రెస్. ప్రస్తుతం బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్‌గా ఉన్న కేశవరావు కూతురు.. గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి. మారిన రాజకీయ సమీకరణాల్లో భాగంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు సమాచారం. ఇక కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న దివంగత ప్రియరంజన్ దాస్ మున్షీతో కేకేకు మంచి సంబంధాలున్నాయి. పాత రాజకీయ పరిచయాలతో కేకే కుటుంబంతో మున్షీ సంప్రదింపులు జరుపుతున్నారు. కాంగ్రెస్‌లోకి రావాలని కేకే కుటుంబాన్ని ఆహ్వానించారు దీపాదాస్ మున్షీ. తాను పార్టీ మారే పరిస్థితి లేదని.. మేయర్ విజయలక్ష్మి చెబుతున్నా, పార్లమెంట్ ఎన్నికల ముందే.. గ్రేటర్ బిగ్ న్యూస్ చూస్తారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల గెలుపుతో ఇక పార్లమెంట్ లో సత్తా చాటాలని భావిస్తోంది కాంగ్రెస్. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ గ్రేటర్ మాత్రం ఆశించిన సీట్లు రాబట్టలేకపోయింది. దీంతో గ్రేటర్ గురి పెట్టింది కాంగ్రెస్.

# మూడంచెల వ్యూహం



హైదరాబాద్ మార్చి, 22 : మూడు అంచెలుగా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకొని, బూత్ కమిటీలో అయిదుగురు కీలక సభ్యులు నియమించుకొని లోక్‌సభ ఎన్నికల్లో 14 ఎంపి సీట్లను గెలిచి తీరాలని సిఎం రేవంత్ రెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికలయ్యేంత వరకు ముఖ్య నేతలందరూ కలిసికట్టుగా బాధ్యతలను పంచుకోవాలని, కార్యకర్తలకు వెన్నంటి ఉండాలని సిఎం రేవంత్ వారికి సూచించారు. గతంలో తమకు విజయం తెచ్చిపెట్టిన మల్కాజ్‌గిరి ఎన్నికల మోడల్ ను రాష్ట్రమంతటా అనుసరించాలని రేవంత్ రెడ్డి వారికి దిశా నిర్దేశం చేశారు. అందులో భాగంగా ఒకటి రెండు రోజుల్లోనే అన్ని నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. పార్లమెంట్ స్థాయి, అసెంబ్లీ, బూత్ స్థాయిల్లో మూడెంచెలుగా పార్టీ సమన్వయ కమిటీలను నియ మించుకోవాలని ఆయన సూచించారు. పార్లమెంట్ నియో జకవర్గ స్థాయి కమిటీలో ఏఐసిసి పరిశీలకులతో పాటు అక్కడి పార్టీ ముఖ్యులు సభ్యులుగా ఉంటారని, ఒక్కో పార్ల మెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని, నియోజకవర్గ స్థాయి కమిటీలో ఎమ్మెల్యే లేదా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రతి మండలం నుంచి ముఖ్య నేతలు ఉంటారని ఆయన తెలిపారు. బూత్ స్థాయి కమిటీల్లో చురుకైన పార్టీ సభ్యులు అయిదుగురికి అవకాశం కల్పించాలని, బూత్ కమిటీలో ఉండే ఈ అయి దుగురు ఈ సారి ఎన్నికల్లో అత్యంత కీలక పాత్ర పోషి స్తారని సిఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ ఎన్నికలకు వారే సైనికులుగా నిలబడుతారని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థికి ఆ బూత్‌లో వచ్చిన ఓట్ల సంఖ్య బూత్ కమిటీ సభ్యుల పనితీరుకు ప్రాతిపదికగా నిలుస్తుందని ఆయన తెలిపారు. బూత్ కమిటీల్లో ఉన్న సభ్యులకు భవిష్యత్‌లో తగిన గుర్తింపునిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ముఖ్య నేతలతో పేర్కొన్నారు. వారి పనితీరును బట్టి త్వరలో నియమించే ఇందిరమ్మ కమిటీల్లో వారికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు సిఎం రేవంత్ తెలిపారు.

## ఇఎపిసెట్, ఐసెట్ షెడ్యూల్‌లో...

# మార్పు

హైదరాబాద్ మార్చి, 22 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో జరగాల్సిన పలు ఎంట్రన్స్ టెస్టుల తేదీల్లో మార్పులు జరిగాయి. టిఎస్ఇఎపిసెట్ (ఎంసెట్), ఐసెట్ పరీక్షను పరీక్షల షెడ్యూల్‌లో ఉన్నత విద్యామండలి మార్పులు చేసింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఇఎపిసెట్ పరీక్షలు మే 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగాల్సి ఉంది.

కానీ తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు మే 13వ తేదీన జరగనున్నాయి. పరీక్షలకు, ఎన్నికల తేదీకి ఒక్క రోజు మాత్రమే తేడా ఉండటంతో విద్యార్థులు గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని భావించిన తెలంగాణ ఉన్నత విద్యామండలి ఇఎపిసెట్ తేదీల్లో మార్పులు చేసింది.

మే 7, 8వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు, మే 9, 10, 11వ తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 4, 5వ తేదీల్లో ఐసెట్ పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ జూన్ 4వ తేదీన పార్లమెంటు ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో ఒక రోజు ఆలస్యంగా ఐసెట్ పరీక్ష నిర్వహించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 5, 6వ తేదీల్లో టిఎస్ ఐసెట్ పరీక్ష జరగనుంది.

**మారిన ఇఎపిసెట్, ఐసెట్ పరీక్షల షెడ్యూల్**

- మే 9 నుంచి 12 వరకు జరగాల్సిన ఇఎపిసెట్ మే 7 నుంచి 11 వరకు రీ షెడ్యూల్
- మే 7,8 తేదీలలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు
- మే 9,10,11 తేదీలలో ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు
- జూన్ 4,5 తేదీలలో జరగాల్సిన ఐసెట్ జూన్ 5,6 తేదీలకు మార్పు

## నా నియోజకవర్గంలో...

# నారీ శక్తి ఏమిటో చూపించారు



హైదరాబాద్ మార్చి, 22 : ఓ ఇంట్లోకి దొంగతానికి ప్రవేశించినా దుండగులను తరిమేందుకు తల్లీకుమార్తెలు చేసిన విరోచిత పోరాటం స్ఫూర్తిగా నిలుస్తోంది. దుండగుడి చేతిలో తుపాకీ ఉన్నా ఏ మాత్రం వణుకూ బెణుకూ లేకుండా వారిద్దరూ ఎదిరించిన తీరు మహిళా శక్తిని మరోసారి చాటింది. వీరి ధైర్య సాహసాలను పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. శుక్రవారం మల్కాజిగిరి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్ మహిళలను సన్మానించి నారీ శక్తికి వందనం అంటూ కొనియాడారు. నగర పోలీసులు కూడా వేగంగా స్పందించి పారిపోతున్న వారిని పట్టుకున్నారని వారికి అభినందనలు తెలిపారు. తెలంగాణ పోలీస్ అనేక విషయాల్లో నైపుణ్యం సంతరించుకున్న వారని మహానగరం పాలిటన్ సిటీ అని అనేక రాష్ట్రాల వారు ఇక్కడ జీవిస్తున్నారని, పటిష్ట భద్రత ఉన్నా ఇలాంటివి జరగడం బాధాకరమన్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో కొంతమంది యువకులు ఆకతాయి పనులు చేస్తున్నారని పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని ప్రభుత్వం అలాంటివి జరగకుండా అరికట్టాలని కోరారు.

# బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లండి

## ఎమ్మెల్సీ కవితకు సూచించిన సుప్రీం



న్యూఢిల్లీ మార్చి, 22 : బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు సూచించింది. దీనిపై ఈడీకీ నోటీసులు జారీచేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తన అరెస్టు చట్టవిరుద్ధమంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈడీ వ్యవహరించిన తీరు, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తమను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయని కవిత తరఫు న్యాయవాది కపిల్ సిబల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో ఒక సాక్షిగా, మరోసారి నిందితురాలిగా పిలిచారని తెలిపారు. కవితకు వ్యతిరేకంగా ఒక్క బలమైన సాక్ష్యం కూడా లేదని, అప్రూవర్ ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ప్రస్తుతానికి తాము కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని స్పష్టం చ ఏసింది. ఇందులో తాము బెయిల్ ఇవ్వలేమని, మొదట కింది కోర్టును ఆశ్రయించాల్సిందేనని తెలిపింది.

ఆ స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉందన్న ధర్మాసనం.. త్వరితగతిన కేసు విచారణ చేపట్టాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. ఈ పిటిషన్‌లో రాజ్యాంగ ఉల్లంఘనకు సంబంధించిన అంశాలను లేవనెత్తినందున.. దీన్ని ఇప్పటికే దాఖలైన విజయ్ మదన్ లాల్ కేసుకు జతచేస్తున్నట్లు వెల్లడించింది.

# సుప్రీం చురకలతో 24 గంటల్లో పొన్ముడితో ప్రమాణం చేయించిన గవర్నర్



న్యూఢిల్లీ మార్చి, 22: డిఎంకె సీనియర్ నేత కె పొన్ముడి శుక్రవారం తమిళనాడు రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర వివాదాస్పద గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయనతో ఇక్కడ రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ప్రమాణం చేయించారు. మంత్రిగా ఆయన కొనసాగింపు విషయంలో అభ్యంతరాలు వద్దని పేర్కొన్నప్పటికీ తమ రూలింగ్‌ను గవర్నర్ బేఖాతరు చేయడంపై ఒక్కరోజు క్రితమే సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ధర్మాసనం ఆదేశాలనే ధిక్కరిస్తారా? అని చురకలకు దిగింది. ఈ దశలో మరుసటి రోజే గవర్నర్ ఆయనతో మంత్రిగా ప్రమాణం చేయించారు. ఇప్పుడు ఆయన తిరిగి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మద్రాసు హైకోర్టు పొన్ముడిని దోషిగా తీర్పు వెలువరించింది. దీనితో గవర్నర్ రవి ఆయనపై బర్తరఫ్ వేటు వేశారు. ఇప్పుడు మూడు నెలల వ్యవధి తరువాత తిరిగి ఆయన మంత్రి అయ్యారు. ఇప్పుడు జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ ఇతర మంత్రులు , ఎంఎ సుబ్రమణియన్ హాజరయ్యారు.

మంత్రి పదవి నుంచి పొన్ముడి తొలిగింపు వ్యవహారం సిఎం గవర్నర్ మధ్య తీవ్రస్థాయి చిచ్చుకు దారితీసింది. ఈ నెల 13న సిఎం గవర్నర్‌కు ఓ లేఖ రాశారు. ఇందులో పొన్ముడికి తాము తిరిగి పాత మంత్రిత్వశాఖను అప్పగిస్తున్నామని, ఆయనతో మంత్రిగా ప్రమాణం చేయించి, బాద్యతల స్వీకరణకు వీలు కల్పించాలని కోరారు. అయితే గవర్నర్ ఈ అభ్యర్థన లేఖను తోసిపుచ్చారు. పొన్ముడి దోషిత్వ నిర్ధారణను కోర్టు తాత్కాలికంగా పక్కకు పెట్టిందని, కొట్టివేయలేదని గవర్నర్ తిరుగుటపా సమాధానం ఇచ్చారు. ఈ వ్యవహారంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గవర్నర్ వ్యవహారశైలిపై సుప్రీంకోర్టు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది.

# కాంగ్రెస్‌కు మరో షాక్

న్యూఢిల్లీ మార్చి, 22 : ఆదాయపు పన్ను (ఐటి) శాఖ తమకు వ్యతిరేకంగా చేపట్టిన పన్ను తిరిగి మదింపు ప్రక్రియలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. 2014 నుంచి 2017 వరకు వరుసగా మూడు సంవత్సరాల పాటు పన్ను తిరిగి మదింపు వేయడానికి ఐటి శాఖ ప్రయత్నించింది. న్యాయమూర్తులు యశ్వంత్ వర్మ, పురుషైంద్ర కుమార్ కౌరవ్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. కాంగ్రెస్ తరఫున హాజరైన అభిషేక్ మను సింఘ్వి, ఐటి శాఖ తరఫున హాజరైన జోహెబ్ హుస్సేన్ వాదనలు విన్న తరువాత కోర్టు బుధవారం (20న) తన తీర్పును రిజర్వ్ చేసింది. తిరిగి పన్ను మదింపు ప్రక్రియలను కాంగ్రెస్ సవాల్ చేసింది. ఐటి శాఖపై 'పరిమితి కట్టడి ఉంది' అని, ఐటి శాఖ గరిష్ఠంగా ఆరు మదింపు సంవత్సరాలకు తిరిగి వెళ్లి ఉండవలసిందని పార్టీ వాదించింది. అయితే, పన్ను ప్రాధికార సంస్థ ఏ చట్టబద్ధమైన నిబంధననూ ఉల్లంఘించలేదని ఐటి శాఖ స్పష్టం చేసింది. స్వాధీనం చేసుకున్న సాధనాల ప్రకారం, కాంగ్రెస్ 'తప్పించుకున్న' ఆదాయం రూ. 520 కోట్ల పైనే ఉందని ఐటి శాఖ ఆరోపించింది. రూ. 100 కోట్లకు పైగా బకాయిల వసూలుకు ఐటి శాఖ జారీ చేసిన నోటీస్‌పై స్టే ఇవ్వడానికి కాంగ్రెస్ అర్జీని తిరస్కరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఈ నెలారంభంలో ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఐటిఎటి) ఉత్తర్వును ధ్రువీకరించింది. '(సదరు) ఉత్తర్వు విషయంలో జోక్యానికి మాకు ఏ కారణమూ కనిపించడం లేదు' అని జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. అయితే, పరిస్థితులు ఏవైనా మారిన పక్షంలో ఐటిఎటిని తిరిగి ఆశ్రయించేందుకు కాంగ్రెస్‌కుఢిల్లీ హైకోర్టు స్వేచ్ఛ ఇచ్చింది.

గరుడ వార్త



## సంపాదకీయం

# రాజకీయ ఇఫ్తార్ విందులు

ధార్మిక సంప్రదాయాలను భక్తి శ్రద్ధలతో పాటించడం ఏ మతానికి సంబంధించిన వారికైనా ఒక వ్యక్తిగత వ్యవహారం. ఆ ఆచారాలను నిష్ఠగా, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా ఆచరించాలి, అయితే అందుకు భిన్నంగా మత విశ్వాసాల పేర రాజకీయ కోణంతో ఏ రకమైన సందడి చేసినా ఆ ధార్మిక కార్యం అపవిత్రమవుతుంది. ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఇస్లాంలోని ఐదు మౌలిక సూత్రాలలో ఒకటి. ఉపవాస దీక్ష (రోజా లేదా సోం) విరమించే సూర్యాస్తమయ సందర్భం అత్యంత కీలకమైంది. రంజాన్ మాసంలో ఇస్లాం మత విశ్వాసులు ప్రతి రోజూ సూర్యోదయం కంటే ముందు నుంచి ఆహారం, నీళ్ళు లేకుండా దినమంతా పాటించిన దీక్షను సూర్యాస్తమయ సమయంలో ముగిస్తూ తాను చేసిన పాపాలకు ప్రాయశ్చితంగా అల్లాహ్‌ను క్షమాపణ కోరుకోవడం (దీనినే మఘ్ఫిరత్ అని అంటారు) ఇఫ్తార్‌లోని కీలక ఘట్టం. ఇది పూర్తిగా వ్యక్తిగత, ధార్మిక వ్యవహారం. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజాలు రంజాన్ పర్వదినాలను రంగరంగ వైభవంగా జరుపుకోవడం పరిపాటి. అయితే ఇఫ్తార్ సందర్భాన్ని మాత్రం పూర్తిగా అధ్యాత్మిక చింతనతో కుటుంబ సభ్యుల మధ్య భక్తితత్పరతతో జరుపుకోవడం ఆనవాయితీ. దురదృష్టవశాత్తు భారతావనిలో ఇఫ్తార్ అనేది రాజకీయ ప్రయోజనాలకు ఒక వేడుకగా మారిపోయింది. ఇస్లాం పేర రాజకీయ పబ్బం గడుపుకొనే అన్ని స్థాయిల ముస్లింల నాయకులకు తోడుగా రాజకీయ పక్షాలు కూడ ఇందులో పాలు పంచుకోవడం వల్ల ఇఫ్తార్ ఉద్దేశ్యం దారి తప్పుతోంది. ఢిల్లీలో రంజాన్ మాసంలో ఇఫ్తార్ అనేది రాజకీయవేత్తలు తప్పకుండా పాల్గొనే ఒక విందు భేటీ. ఈ విందుకు తేదిలను ఎంపిక చేసుకోవడం ప్రముఖ నాయకులకు చాలా కష్టంగా ఉండేది. పార్లమెంటులో అనుసరించవల్సిన వ్యూహాలను కూడ ఒకప్పుడు రాజకీయ పార్టీల ప్రముఖులు ఇఫ్తార్ విందుల సందర్భంగా కలుసుకుని, నిర్ణయించుకునే వారు. ఆ విందులు సాధారణంగా రాజకీయ సయోధ్యకు దోహదం చేసేవి. తెలుగు రాష్ట్రాలలో అటు కర్ణాటక సరిహద్దులో ఆంధ్రప్రదేశ్‌లోని పుంగనూరు మొదలు ఇటు తెలంగాణలో మహారాష్ట్ర సరిహద్దులో సిర్పూర్ వరకు ఇప్పటికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు ఒక రాజకీయ అనివార్యతగా ఉన్నది. హైదరాబాద్‌లో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా, జూబ్లీ హాల్ లేదా యల్.బి. స్టేడియంలో ప్రభుత్వమే ఇఫ్తార్ విందులు ఇవ్వడం ఒక ఆనవాయితీగా వస్తోంది. అధికారంలో ఉన్న నాయకులు రావడం, నెత్తిన టోపీ ధరించి, ఖజ్జురపు పళ్ళు తినడం లేదా భాయి సాబ్ నాయకులకు తినిపించడం ఒక సంస్కృతిగా మారిపోయింది. ఈ రకమైన ప్రచార ఆర్భాటాలకు ముస్లిం ధార్మికవేత్తలు అయిన హాఫెజ్, ఆలీం, ఇమాంలు గతంలో దూరంగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఈ మతాచార్యులు కూడా ఈ ఇఫ్తార్ విందులలో పాల్గొంటున్నారు. ఇఫ్తార్ విందులో అధికార పక్షానికి చెందిన ఒక రాజకీయ నాయకుడు వచ్చి టోపీ ధరిస్తే ముస్లిం వర్గాలు సంతోషిస్తున్నాయి. అయితే ఒక ముస్లిం నాయకుడు ఎవరైనా దేవాలయానికి వెళ్ళి వేదపండితుల దీవెనలు తీసుకోవడాన్ని ముస్లిం వర్గాలు, ముఖ్యంగా రాజకీయశ్రేణులు హర్షించలేకపోతున్నాయి. తెలంగాణలో హైదరాబాద్ నగరం బయట ముస్లిం ఓట్లర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం నిజామాబాద్ అర్బన్. ఇటీవలి శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్ధిగా పోటీ చేసిన మొహమ్మద్ అలీ షబ్బీర్, సామాజిక వర్గాల గణంకాల ప్రకారం సునాయాసంగా గెలిచి తీరాలి. అయితే ఆయన 14 వేల ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ఒక ఆలయాన్ని సందర్శించిన షబ్బీర్ అలీ వేద పండితుల నుండి ఆశీర్వాదాలు తీసుకోవడాన్ని చూపిస్తున్న ఒక ఫోటోను ఆయన రాజకీయ ప్రత్యర్థులు విస్తృతంగా ప్రచారం చేసారు, షబ్బీర్ అలీ ఓటమికి ప్రధాన కారణాలలో ఆ ఫోటో ప్రచారం ఒకటి. ఇఫ్తార్ పార్టీ విందుకు టోపీ ధరించి వచ్చే హిందూ రాజకీయ నాయకులను చూసి అమితంగా సంతోషించేవారు, షబ్బీర్ అలీ ఒక హిందూ దేవాలయాన్ని సందర్శించడాన్ని సంకుచిత ధోరణితో చూడడం ఎంత వరకు సమంజసం? రంజాన్ మాసం పూర్తయిన కొద్ది కాలానికి వచ్చేది హజ్ మాసం. మోతాదుకు మించి ప్రభుత్వ జోక్యం, నాయకుల ప్రచారం మంచిది కాదు. ధార్మిక అంశాలను అధ్యాత్మిక దృక్ఫథంతో మాత్రమే చూడాలి కానీ అందులో రాజకీయ దృష్టి ఉండకూడదు. దేవుడి పేరిట ఓట్లు అడిగే రాజకీయం ఆ వైఖరితోనే ఆరంభమవుతుంది. కాషాయం లేదా ఖజ్జురం అందుకు మినహాయింపు కాదు. ఇఫ్తార్ పార్టీ విందుకు టోపీ ధరించి వచ్చే హిందూ రాజకీయ నాయకులను చూసి అమితంగా సంతోషించేవారు, షబ్బీర్ అలీ ఒక హిందూ దేవాలయాన్ని సందర్శించడాన్ని సంకుచిత ధోరణితో చూడడం ఎంత వరకు సమంజసం? రంజాన్ మాసం పూర్తయిన కొద్ది కాలానికి వచ్చేది హజ్ మాసం.


# కాంగ్రెస్‌లో కొత్త చిచ్చు రేపిన కార్పొరేషన్లు.. మంత్రులు అలిగింది అందుకేనా..?



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు దక్కని నేతలు.. పార్టీలో కీలకమైన నేతలకు ఆయా కార్పొరేషన్ పోస్టులను ఇవ్వాలని నిర్ణయించింది కాంగ్రెస్ పార్టీ. అందులో భాగంగా ఇటీవల దాదాపు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఈ నియమాకాల నిర్ణయం ఒకవైపు పార్టీలో.. మరొవైపు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమైన నేతల మధ్య చిచ్చు రాజేస్తోంది. ప్రధానంగా తాము సూచించిన నేతలకు పదవులు దక్కలేదని, మరికొంత మంది తమను సంప్రదించకుండానే పోస్టులను భర్తీ చేస్తున్నారని గుర్రుగా ఉన్నారట. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో ప్రధానంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్రుగా ఉన్నారట. ఉమ్మడి కరీంనగర్ విషయంలో తాను సూచించిన వ్యక్తులకు పదవులు ఇవ్వలేదని సీరియస్‌గా ఉన్నారట. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కేవలం మంత్రి శ్రీధర్‌బాబు మనుషులకే పోస్టులు దక్కాయని, తాను సూచించిన వారికి అవకాశం రాలేదని గుర్రుగా ఉన్నారట. కరీంనగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నియామకంపై పొన్నం మరింత ఆగ్రహంగా ఉన్నారట. కరీంనగర్ లోక్ సభ ఇంచార్జ్‌గా ఉన్న తనను సంప్రదించకుండా భర్తీ చేయడంపై అసంతృప్తిగా ఉన్నారట. ఈ విషయంలో రాష్ట్ర పార్టీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షికి ఫోన్ చేసి, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం. అలాగే సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి సైతం ఫోన్ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారట. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నేరెళ్ల శారద, అయిత ప్రకాష్ రెడ్డి, జనక్ ప్రసాద్ ఇలా అందరూ శ్రీధర్‌బాబు వర్గానికి చెందిన వారికే పదవులు దక్కడంపై పొన్నం గుర్రుగా ఉన్నారని ఆయన సన్నిహిత వర్గాలు చెప్పుకుంటున్నాయి. అలాగే మరో సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సైతం అసంతృప్తిగా ఉన్నారు. తన శాఖ పరిధిలో భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల విషయం కూడా తనకు తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఇరిగేషన్ శాఖలోని ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా కొల్లాపూర్‌కు చెందిన జగదీశ్వర్ రావును నియమించారు. దీంతో ఉత్తమ్ అసంతృప్తిగా ఉన్నారట. ఇక పార్టీలో సీనియర్ నేత, ప్రచార కమిటీ చైర్మన్‌గా ఉన్న మధు యాష్కీ గౌడ్ సైతం అసంతృప్తిగా ఉన్నారట. తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన నిజామాబాద్ జిల్లాకు సంబంధించి పెద్ద ఎత్తున నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినా, తనను మాట మాత్రం సంప్రదించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. సీనియర్ నేతగా తనను సంప్రదించకుండా పోస్టులు భర్తీ చేశారంటూ గుర్రుగా ఉన్నారట.

# ధైర్యసాహసాలకు గుర్తింపు.. దొంగలతో పోరాడిన తల్లికూతురికి పోలీసుల సన్మానం

హైదరాబాద్: బేగంపేటలోని ఓ కాలనీలో ఓ ఇంట్లోకి చొరబడిన దొంగలతో ధైర్యంగా పోరాడిన మహిళను, ఆమె కుమార్తెను పోలీసులు శుక్రవారం సన్మానించారు. సోషల్ మీడియాలో అందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో వీరిని నార్త్ జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శి గుర్తించారు. అంతకు ముందు తల్లీకూతుళ్లు తమ ఇంట్లో చోరీ యత్నాన్ని భగ్నం చేశారు. వారి చూపిన ధైర్య సాహసాలకు కాను పోలీసులు గుర్తించి సన్మానించారు. సీసీటీవీ ఫుటేజీలో ఇద్దరు మహిళలు దొంగలతో ధైర్యంగా పోరాడుతూ వారి దోపిడీ ప్రయత్నాన్ని అడ్డుకోవడం కనిపించింది. నవరత్న జైన్, అతని భార్య అమిత తమ కుటుంబంతో కలిసి హౌసింగ్ కాలనీలో



నివసిస్తున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం 2.15 గంటల ప్రాంతంలో అమిత, ఆమె కూతురు, పనిమనిషి ఇంట్లో ఉండగా ప్రేమ్‌చంద్, సుశీల్ కుమార్ అనే వ్యక్తులు కొరియర్ డెలివరీ పేరుతో ఇంట్లోకి ప్రవేశించారు. అమిత వారిద్దరినీ తలుపు బయటే ఉండమని కోరింది, అయితే సుశీల్ కుమార్ హెల్మెట్ ధరించి ఇంట్లోకి ప్రవేశించి తన బ్యాగ్ నుండి తుపాకీని తీసి అమితపై గురిపెట్టాడు. ఆ తర్వాత ప్రేమ్‌చంద్ వంటగదిలోకి వెళ్లి పనిమనిషి మెడపై కత్తి వేశాడు. విలువైన వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అదే సమయంలో అమిత సుశీల్‌ని కాలితో బలంగా తన్నింది. అంతకు ముందు ఆమె కూతురు కూడా రావడంతో తల్లి, కూతురు కలిసి దొంగ సుశీల్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె ఎలాగోలా సుశీల్‌ని పట్టుకుని కేకలు వేయడంతో పాటు దొంగలపై దాడికి పాల్పడ్డాడు. తల్లి, కూతురి అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకోగానే పరారయ్యాడు. వీరి ధైర్యానికి పోలీసులే కాదు.. నెటిజన్స్ సలాం కొడుతున్నారు.

# ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అరెస్టు...

## దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు



హైదరాబాద్ : ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు అని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే ఏకైక సంకల్పంతో కేంద్రంలోని అధికార బిజెపి వ్యవహరిస్తున్నదని ఇటీవల జరిగిన జార?ండ్ ముఖమంత్రి హేమంత్ సోరెన్, బిఆర్ఎస్ ఎంఎల్సి కవిత అరెస్టు ఘటనలు రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఇడి,సిబిఐ, ఐటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం పావులుగా వాడుకుంటున్నదని అన్నారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్న బిజెపి ప్రభుత్వ చర్యలను భారత రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తున్నదని పేర్కొన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ రాజకీయ ప్రేరేపిత అరెస్ట్ అని, అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకొని, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ డిమాండ్ చేశారు.

# పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే నా లక్ష్యం: రఘువీర్ రెడ్డి



నల్లగొండ: నిరుద్యోగ సమస్యను తొలగించేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కుందూర్ రఘువీర్ రెడ్డి తెలిపారు. నల్లగొండ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కుందూర్ రఘువీర్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడమే తన మొదటి ప్రాధాన్యత అని, పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ అసలు పోటీలో లేదని, బిజెపికి ఇక్కడ ఓటు బ్యాంకే లేదని ఎద్దేవా చేశారు. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలిచి తీరుతుందని రఘువీర్ స్పష్టం చేశారు.

# దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నాగేందర్ ఎన్నిక చెల్లదంటూ ఆయన ప్రత్యర్థి విజయారెడ్డి వేసిన పిటిషన్ ను హైకోర్టు శుక్రవారం విచారణకు స్వీకరించి, నాగేందర్ కు నోటీసులు జారీ చేసింది. దానం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంనుంచి బిఆర్ఎస్ టికెట్ పై ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. ఆయన చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి ఓడిపోయారు. అయితే ఇటీవల దానం బిఆర్ఎస్ ను వదిలి కాంగ్రెస్ లో చేరి, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో దానం ఓటర్లను ప్రలోభపెట్టి గెలిచారని, డబ్బులు పంచారని విజయారెడ్డి కేసు వేశారు.

# బాలుడిని బలి తీసుకున్న కుక్కలు



**శామీర్ పేట, (గరుడ వార్త):** కుక్కలు దాడిలో తీవ్రంగా గాయాల పాలైన బాలుడు శుక్రవారం మృతి చెందాడు. మండల కేంద్రం శామీర్ పేట పెద్దమ్మ కాలనీలో నివాసముంటున్న బాలు మేస్త్రి పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు అబ్బాయిలు, ఒక పాప ఉన్నారు. ఈనెల 19న బాలు పెద్ద కుమారుడైన ప్రవీణ్ (11) పై కుక్కలు దాడి చేశాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రవీణ్ నగరంలోని ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కుక్కలు విచ్చల విడిగా సైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజలను కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

# వైద్య ఖర్చులకు రూ. 20వేల ఆర్థిక సాయం: తుంకి రమేష్



**శామీర్ పేట, (గరుడ వార్త) :** కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న యువకుడికి 20 వేల ఆర్థిక సహాయాన్ని తుంకి రమేష్ అందజేశారు. శుక్రవారం శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామానికి చెందిన వల్లపు కరుణాకర్ కు రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్ర అవస్థలు పడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం తుంకి రమేష్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుంకి రమేష్ మాట్లాడుతూ చిన్న వయసు కిడ్నీలు పాడవడంతో వైద్య ఖర్చులకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో తన వంతు సహాయంగా రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు చెప్పారు. ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆదుకొని మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్బ గౌని వీరయ్య గౌడ్, మాజీ వార్డు సభ్యురాలు కోడూరి నర్మదా తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులపై...

# రైతులకు అవగాహన



**శామీర్ పేట, (గరుడ వార్త) :** సేంద్రియ ఎరువుల తో భూమి ఎంతగానో సారవంతంగా మారుతుందని రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు (ఏడిఏ) ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం శామీర్ పేట మండలం అలియాబాద్ పరిధిలోని రైతు వేదికలో సేంద్రియం ఎరువులపై రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసానిక ఎరువులు వాడితే నేల సారవంతం కోల్పోతుందని తెలిపారు. సేంద్రియ ఎరువులను వాడితే నేల సారవంతం పెరగడంతో పాటు అధిక దిగుబడును లభిస్తాయని చెప్పారు. రైతులు ఆవులను పెంచుకొని వాటి పేడ, మూత్రాన్ని పంటలకు ఉపయోగించుకుంటే మంచి లాభాలు వస్తాయని సూచించారు. మన చుట్టూ పెరుగుతున్న చెట్ల ఆకులతో కషాయాలు తయారు చేసుకుని పంటలను, భూమిని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తారనాధికారి రవి యాదవ్, ఎఫ్ ఎస్ సి ఎస్ క్లార్క్ విజయ్ కుమార్, రైతులు జగన్మోహన్ రెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కుంట మల్లేష్, బిక్షపతి, మల్లేష్, వీరయ్య గౌడ్, కొండల్ రెడ్డి, కిట్టు రెడ్డి, కొంగ నాగులు, కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, కృష్ణ, మలేష్ యాదవ్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదే!



హైదరాబాద్ : డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు నాయుడు బంధువులదే అని ఏపి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి ఆరోపించారు. శుక్రవారం తాడేపల్లి వైసిపి కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. తాము ఏం మాట్లాడుతున్నాం అనే ఇంగితం చంద్రబాబుకు ఉండాలన్నారు. టీడీపీ వారి అరుపులే నిజాలైపోతే, ఆ పార్టీ చెప్పే అబద్ధాలన్నీ కూడా నిజాలైపోతాయన్నారు. గాల్లోంచి తీసి కల్పితాలను కూడా నిజాలుగా వారు చిత్రీకరించగల సమర్థులని ఆరోపించారు. గుమ్మడికాయ దొంగెవరూ భుజాలు తడుముకుంటున్న చందాన దొంగే దొంగ దొంగ అని అరుచుకుంటూ వెళ్తున్నారన్నారు. వైజాగ్ డ్రగ్స్ కేసు సినీ ఫక్కీలో పట్టుబడిందని, సీబీఐ దాన్ని పట్టికుందన్నారు. ఓ వైపు విచారణ జరుగుతోందని, ఈ నేపథ్యంలో టీడీపీ వారి పైత్యం విపరీతంగా మారిపోతోందన్నారు. నేరుగా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అని చెప్పుకునే లోకేశ్‌లు కూడా ట్వీట్‌లు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

అసలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేశాడు. మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తాపత్రయపడుతున్నాడని, మాట్లాడేటప్పుడు ఏం మాట్లాడుతున్నాం అనే ఇంగితం ఉండాలి కదా అని ప్రశ్నించారు. జరిగిన విషయంలో వాస్తవాలు ఏంటి? అనేది అంత అనుభవం ఉన్న వ్యక్తి ఆలోచించుకోవాలి కదా అని నిలదీశారు. భారీ ఎత్తున డ్రగ్స్ పట్టుకున్నారని , అది దేశంలోకి వచ్చి ఉంటే భయంకరంగా ఉండేదని పట్టుకోవడం ఓ పెద్ద రిలీఫ్ అని తెలిపారు. టిడిపి వారు అరిచే అరుపులు చూస్తుంటే వీళ్లే దాని వెనుక ఉన్నారేమో అనే అనుమానం కలుగుతోందన్నారు. పోనీ ఆ కంపెనీ చరిత్ర తీస్తే అంతా వారి కుటుంబాలకు దగ్గరగా ఉండే బంధువులు ఉన్నారని తెలిపారు. సాక్షాత్తు పురందేశ్వరి కొడుకు కూడా వారి కంపెనీల్లో భాగస్వామిగా ఉన్నారన్నారు. ఆమె వియ్యంకుడు కూడా ఆ కంపెనీలో పార్టనర్‌గా ఉన్నారని, వాళ్లు ప్రమోట్ చేసిన కంపెనీ నుంచి తర్వాత డివైడ్ అయ్యారన్నారు.

ఇలాంటి నేపథ్యంలో మేం ఆరోపణ చేస్తే వాళ్లు సంజాయిషీ ఇచ్చుకోవాల్సింది పోయి ఉల్టా మాపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కచ్చితంగా టీడీపీ వారి ప్రమేయం ఉందని తమ అనుమానం అన్నారు. ఎన్నికలకు వెళ్తున్న సమయంలో తమపై బంద వేసి లబ్ధిపొందాలని చూస్తున్నారని, దానికి సమాధానం చెప్పుకోవాల్సిన దుస్థితి వస్తోందన్నారు. ఒక్క ఈ విషయమే కాదు.. ప్రతి ఒక్క దాంట్లో ఇలానే అర్థం లేని ఆరోపణలు చేస్తూనే ఉన్నారన్నారని, దీనిలో కచ్చితంగా టీడీపీకి సంబందించిన వారి ప్రమోయం ఉందని తాము బలంగా అనుమానిస్తున్నామన్నారు. వాళ్ల ఉలికిపాటు చూస్తుంటే, దాన్ని తెచ్చి ప్రభుత్వంపై, వైఎస్సార్సీపీపై నింద వేయాలని చూస్తుంటే వీళ్లు తప్పించుకోడానికే నింద వేస్తున్నారని అనిపిస్తోందన్నారు.

కచ్చితంగా దీని వెనుక చంద్రబాబు, ఆయన కొడుకు, ఆయన వదిన పురందేశ్వరి, వారి గ్యాంగ్ ఉన్నాయని తాము అనుమానిస్తున్నామన్నారు.

విచారణలో ఈ కోణం కూడా చూడాలని తాము సీబీఐకి పిటిషన్ పెడుతున్నామని, ఈ దిశలో కూడా విచారణ జరగాలని కోరుతున్నామన్నారు.

గంజాయి, డ్రగ్స్ క్యాపిటల్ అంటూ వారే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో గంజాయి పండించి.. టీడీపీ నాయకులే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుని వందల కోట్లు సంపాదిస్తున్నారన్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి సాగును ధ్వంసం చేయడమే కాకుండా ప్రత్యామ్నాయ జీవనోపాధి కూడా చూపించామని తెలిపారు. దానిపై కేంద్ర ప్రభుత్వం కూడా ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని మెచ్చుకుందని గుర్తు చేశారు. ఎస్ఈబీ పెట్టిన తర్వాత 12వేల ఎకరాల్లో సాగును ధ్వసం చేశారని తెలిపారు. ఇప్పుడు డ్రగ్ ఇంపోర్ట్ చేసుకున్న కంపెనీ తప్పుడు పనులు చేస్తే చర్యలు తీసుకుంది కూడా జగన్ ప్రభుత్వమే అని వెల్లడించారు. డ్రగ్స్ వాడకాన్ని తగ్గించడానికి, సాగు లేకుండా చేయడానికి కన్‌స్ట్రక్టివ్‌గా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలను మెచ్చుకోకపోగా.. చంద్రబాబు,పవన్ కల్యాణ్‌లు తమపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో చెప్పుకోడానికి ఏమీ లేదు కాబట్టి ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. థర్డ్ గ్రేడ్ కంటే హీనమైన వ్యక్తి లోకేశ్ అని విమర్శించారు.

ఈ డ్రగ్స్ కేసులో ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు రాతలపై కూడా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు చేస్తున్నామని వెల్లడించారు. థర్డ్ గ్రేడ్ కంటే హీనమైన స్థాయిలో లోకేశ్ ఉన్నాడని, ఎందుకు ట్వీట్ చేస్తున్నాడో, ఏం చేస్తున్నాడో కూడా అతనికి అర్థం కావడం లేదన్నారు. మోకాలికి బట్టతలకు సంబంధం కట్టి ఎక్కడో బ్రెజిల్ దేశంతో సంబంధం కడుతున్నాడని ఆరోపించారు. ఎప్పుడో బ్రెజిల్ అధ్యక్షుడు గెలిచాడని విజయసాయి రెడ్డి ట్వీట్ చేస్తే దాన్ని పట్టుకొచ్చి ఈ కేసుకు అంటగడుతున్నారన్నారు. ఈ డ్రగ్స్ కేసులో ఎవరెవరూ ఉండే అవకాశం ఉంది అని చూస్తే సహజంగానే టిడిపికి చెందిన వారి దగ్గరి బంధువులు, కుటుంబ సభ్యులే కనిపిస్తున్నారని సందేహం వెలిబుచ్చారు. వీళ్లతో కలిసి ఎప్పుడూ తిరిగే వ్యక్తులు, ఆ కంపెనీ వారితో ఉన్న ఫోటోలు కూడా బయటకు వచ్చాయన్నారు. ఇది సహజంగానే వారిపైనే పడుతుంది. అలాంటి ఆలోచనలు చేసే లక్షణం కూడా చంద్రబాబుకు ఉంది కాబట్టి వారిపైనే అనుమానం ఉందన్నారు. అందుకే ఉల్టా మాపైనే ఆరోపణలు చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు.

# ఈసీ మాటలు నీటిపై రాతలేనా...!

'మేము ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అనుమతించం..' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ గత వారం విజ్ఞాన్ భవన్‌లో ఎన్నికల షెడ్యూలును ప్రకటిస్తూ అన్నారు. కండబలం, ధన బలం, తప్పుడు సమాచారం, ఎన్నికల కోడ్ ఉల్లంఘన.. ఈ నాలుగింటినీ సహించే ప్రసక్తి లేదు అని ఆయన చెప్పారు. ఈ ప్రకటన విన్నవారికి సీఈసీ ఎంతో నిజాయితీగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. కాని గత ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పుడు కూడా ఎన్నికల కమిషనర్లు ఇదే విధమైన ప్రకటనలు చేశారు. ఈ దేశంలో అధికారులు కూడా బూటకపు ప్రకటనలు చేసే విషయంలో రాజకీయ నాయకులకు ఏ మాత్రం తీసిపోరని గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది. దాదాపు ఏడు దశలుగా షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి దాదాపు 75 రోజుల్లో ఏఏ చీకటి గుహల్లోంచి డబ్బులు బయటకు వస్తాయో ఎవరు కనిపెట్టగలరు? ఇక షెడ్యూలు ప్రకటించకముందు నిర్వహించిన భారీ బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలకు ఎక్కడి నుంచి డబ్బు ప్రవహిస్తోందో ఎవరైనా లెక్కవేసేవారున్నారా? తెలంగాణలో గత ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా మంది అభ్యర్థులకు చివరి దశలో నిధులు పంపించలేదని, అందుకే వారు ఓడిపోయారని భారత రాష్ట్ర సమితి నేతలే పలువురు చెప్పారు. బహుశా అప్పటికే తాము ఎంత ఖర్చు పెట్టినా ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకుని ఉంటారని కేసీఆర్‌కు సమాచారం అందడంతో ఆయన ఎందుకైనా మంచిదని డబ్బులు పంపించకూడదని నిర్ణయించుకుని ఉంటారని వారు చెబుతున్నారు. ఇదే కేసీఆర్ అంతకుముందు మునుగోడులో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ ఎత్తున డబ్బులు ఖర్చు పెట్టారని, తమ పార్టీ నేతలే అన్నమాట ప్రకారం డబ్బు ఖర్చు పెట్టలేదని బీజేపీ నేతలు వాపోయారు. ఈ డబ్బుల ఖర్చు విషయంపై ఇద్దరు మాజీ ఎంపీల మధ్య వచ్చిన తగాదా చివరకు ఎలా చల్లారిందో కాని వారిద్దరూ ఇప్పుడు మరో అధికార పార్టీలో చేరారు. నిజానికి 2022 ఎన్నికల్లో ఢిల్లీ మద్యం కుంభకోణం డబ్బును ఆమ్ ఆద్మీ పార్టీ హవాలా మార్గం ద్వారా గోవాకు మళ్లించినట్లు ఆధారాలు దొరికినందువల్లే తీగలాగితే డొంకకదిలినట్లు మొత్తం వ్యవహారం బయటపడిందని ఈడీ తన ఛార్జిషీటులో పేర్కొంది. ఈ దేశంలో రాజకీయ పార్టీలు ఒకదానికొకటి సహాయపడేందుకు ఎన్నికల నిధులు మళ్లిస్తే గతంలో ఎవరూ పట్టించుకునేవారు కాదు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నిధుల మళ్లింపుపై నిఘా పెట్టింది.

సమాజ్‌వాది పార్టీ, జనతాదళ్ (యు), జనతాదళ్ (ఎస్), తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల నేతలకు ఎవరెవరు నిధులు పంపారో బీజేపీకి తెలిసినందువల్లనే పంపినవారిని తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడం బీజేపీకి సాధ్యపడిందని చెప్పక తప్పదు. దీని వల్ల భవిష్యత్ రాజకీయ సమీకరణల్ని కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభావితం చేయగలిగారు. తమ పార్టీకోసమే కాకుండా ఇతర రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల కోసం కూడా డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెట్టాలని నేతలు భావిస్తున్నారంటే ఈ దేశంలో రాజకీయాల్లో ఎంత డబ్బు సమకూరుతుందో అర్థమవుతుంది. కేసీఆర్ తన పార్టీ పేరునే మార్చుకుని ఇతర రాష్ట్రాలకు విస్తరించేందుకు ప్రయత్నించడం, భారీ ఎత్తున దేశంలో వందలాది పత్రికలకు సైతం ప్రకటనలు గుప్పించడం, జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు సైతం నిధులు ఇవ్వచూపినట్లు ప్రచారం జరగడం, ఉప ఎన్నికల్లో సైతం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంతో ఈ దేశంలో ఒక ప్రాంతీయ పార్టీ ధన బలం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయింది. 2014 ఎన్నికలకు ముందు అవినీతికి వ్యతిరేకంగా వేదికను ఏర్పాటు చేసి, అన్నాహజారేతో కలిసి యూపీఏకు వ్యతిరేకంగా ధర్నాలు చేసి ప్రాచుర్యంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఎన్నికల కోసం భారీ ఎత్తున నిధులు సేకరించకపోతే ఇవాళ ఆత్మరక్షణలో పడి ఉండేది కాదు. ఈ పార్టీలే కాదు, దేశంలో ఉన్న మెజారిటీ ప్రాంతీయ పార్టీల అధినేతలు అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్ని ఎదుర్కొన్నవారే. భారతీయ జనతా పార్టీ ఈ బలహీనతల ఆధారంగా తన సామ్రాజ్యాన్ని నిర్మించుకుంది.

పోనీ అలా అని ఆ పార్టీ ఎన్నికల వ్యవస్థను ఏమైనా ప్రక్షాళనం చేయగలిగిందా అంటే అదీ లేదు. అన్ని సామ, దాన, బేధ, దండోపాయాలను ఉపయోగించుకుని రాజకీయ నిధుల సమీకరణలో బీజేపీ అన్ని పార్టీలను తలదన్నిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన ఎన్నికల బాండ్ల వివరాలను బట్టి తెలుస్తోంది. అయితే ఎన్నికల బాండ్ల ద్వారా సమీకరించిన మొత్తం ఎన్నో రెట్లు ఎక్కువ మొత్తంలో ధన ప్రవాహం జరుగుతోందని అన్ని రాజకీయ పార్టీలకు తెలుసు. '%ఔష్ట్రవఅ జతీఉఎవ్రాఖుఎం: వీశీఅవఎ ఖఅస వీబంఎశ్రీవ అఅ ×అ-ఎఖుఅ్రాశీశ్రీఉఅఎం%' అని వాషింగ్టన్‌లో కార్నెగీ ఎండోవ్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్‌లో సీనియర్ ఫెలోగా ఉన్న మిలన్ వైష్ణవ్ రాసిన పుస్తకంలో రాజకీయాల్లోకి రాకముందే జగన్మోహన్ రెడ్డి ఆస్తులు ఎలా పెరిగాయో వివరించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు కేవలం రూ. 9లక్షల మేరకే ఆస్తులు ఉన్న జగన్ నికర ఆస్తుల విలువ 2014 నాటికి రూ. 400 కోట్లకు పైగా దాటిందని ఆయన తెలిపారు. భారీ ఎత్తున సంపాదించి ఉండకపోతే కాంగ్రెస్ పార్టీనే ఎదిరించి ఒక రాజకీయ పార్టీ పెట్టగల ధైర్యం ఆయనకుండేది కాదేమో. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత గత అయిదు సంవత్సరాల్లో జగన్ ఎంత మేరకు సమీకరించారో, ఈ ఎన్నికల్లో ఎంత ధనం ప్రవహిస్తుందో ఊహించాల్సిందే. జగన్‌కు, కానీ, కేసీఆర్‌కు కానీ, బీజేపీ, కాంగ్రెస్ వంటి ఇతర పార్టీల నేతలకు కానీ నిధులు సమకూర్చేందుకు కార్పొరేట్ సంస్థలు ఎన్నికల బాండ్ల రూపంలోనే కాకుండా దొడ్డిదారిన కూడా ముట్టజెబుతున్నాయి మైనింగ్, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్, మద్యం, ఇసుక, గేమింగ్, ఫార్మా, టెలికమ్యూనికేషన్, కాంట్రాక్ట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, మాదక ద్రవ్యాలు మొదలైన అనేక రంగాలనుంచి రాజకీయ పార్టీలకు డబ్బులు చేరుతున్నాయి. 2016 నవంబర్ 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశంలో నల్లధనాన్ని రూపుమాపేందుకు పెద్ద నోట్ల రద్దును ప్రకటించిన తర్వాత ఎన్నికల రాజకీయాల్లో నల్లధనం పాత్ర పెరిగిందే కాని తగ్గిన దాఖలాలు లేవు. అసలు ఎన్నికల్లో ఎన్ని వేల కోట్ల ఖర్చువుతున్నదో చెప్పేందుకు కొలమానాలు లేవు. ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం 2019 ఎన్నికల్లో తమిళనాడులో రూ. 900 కోట్లు పట్టుబడగా, ఆ తర్వాత గుజరాత్‌లో రూ. 552 కోట్లకు పైగా స్వాధీనపరుచుకున్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు రూ.



3500 కోట్ల మేరకు దొరికాయి. ఈ లెక్కల్ని చూపి తాము ధన బలాన్ని అరికట్టామని ఎన్నికల కమిషన్ చెప్పుకోవడం హాస్యాస్పదమే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు రూ. 60వేల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. ఇందులో 45 శాతం బీజేపీయే ఖర్చు పెట్టిందని ఈ సంస్థ తెలిపింది. ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి రూ. 100 కోట్లు ఖర్చు పెట్టారని, ప్రతి ఓటరుకు ఓటుకు కనీసం రూ. 700 చెల్లించారని ఈ సంస్థ అంచనా వేసింది. కాని నిజానికి ఈ అంచనా కూడా తక్కువే. కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్‌కు కనీసం రూ.5వేలు చెల్లించిన సందర్భాలు కూడా ప్రజల అనుభవంలో ఉన్నాయి ఈ నేపథ్యంలో ప్రతి లోక్‌సభా నియోజకవర్గానికీ అభ్యర్థికి రూ. 95 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలన్న పరిమితి విధించామని సీఈసీ రాజీవ్ కుమార్ చెబుతుంటే ఎవరికైనా నవ్వు రాకమానదు. కార్పొరేటర్ ఎన్నికకు కూడా ఇంతకంటే ఎక్కువే ఖర్చవుతుందని చాలా మందికి తెలుసు. ధనబలం సంగతి పక్కనపెడితే కండబలం, తప్పుడు సమాచారం, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై కూడా ఎన్నికల కమిషన్ తాను ప్రకటించినట్లుగా చర్యలు తీసుకుంటుందని కూడా నమ్మడానికి వీలు లేదు. ఈ దేశంలో నేతలపై ఉన్న కేసులను చూస్తుంటే నేరచరితులకూ, రాజకీయ నాయకులకూ మధ్య విభజన రేఖ చెరిగిపోతోందని మిలన్ వైష్ణవ్ అన్నారు. కేవలం డబ్బు మాత్రమే కాదు, 2014 ఎన్నికల్లో 5వేల కిలోల మాదక ద్రవ్యాలను ఎన్నికల కమిషన్ అధికారులే స్వాధీనపరుచుకున్నారు. కనీసం ఏడు భారీ స్విమ్మింగ్ పూల్స్‌లో నింపగల మద్యం పట్టుబడిందని అధికారులు తెలిపారు. దాదాపు 40శాతం మంది నేరచరితులు రాజకీయాల్లో ప్రవేశిస్తున్నారు.

## తైబజార్ వేలంపై సందిగ్ధం....

### - మూడేళ్లుగా మునిసిపల్ ఆదాయానికి గండి
### - కరోనా, లాక్‌డౌన్‌తో మొదలైన సమస్య



**గద్వాల టౌన్ :** మునిసిపాలిటీకి స్థానికం గా లభించే ఆదాయ వనరుల్లో ప్రధానమైన తైబజార్ వేలం నిర్వహణపై మూడేళ్లగా సందిగ్ధం వీడటం లేదు. ప్రతీ ఏట ఆర్థిక సంవత్సరం ఆరంభానికి (మార్చి నెలాఖరులోగా) ముందు నిర్వహించాల్సిన తైబజార్ వేలంపై కౌన్సిల్‌లో ఇప్పటికీ నిర్ణయం జరగకపోవడం గమనార్హం. 2020 మార్చిలో కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్‌తో తైబజార్ నిర్వహణపై నెలకొన్న సమస్య ఇప్పటికీ పరిష్కారం కావడం లేదు. లాక్‌డౌన్ అనంతరం మిగిలిన కాలానికి వేలం నిర్వహించేందుకు ప్రయత్నం జరిగినా అనేక కారణాలతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. ఆ తర్వాత తైబజార్ వేలం నిర్వహణపై అటు ప్రజాప్రతినిధులోనూ, ఇటు అధికారుల్లోనూ స్పష్టత కరువైంది. దీంతో మునిసిపాలిటీకి వచ్చే దాదాపు రూ.40 లక్షల వార్షిక ఆదాయానికి గండి పడింది. మునిసి పాలిటీపై ఆర్థిక భారాన్ని తగ్గించుకునే దిశగా ఇప్పటికే పట్టణంలో ఇంటింటి నుంచి చెత్త సేకరించే పనిని ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఈ నేపథ్యంలో ఏడాదికి లక్షల్లో ఆదాయం సమకూర్చే తైబాజార్ ఆదాయంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. పట్టణం పరిధిలో ప్రతి ఏటా వసూలు చేసే తైబజార్ పన్నుల జాబితాలో 2019 వరకు కూరగాయల హెూల్‌సేల్ వ్యాపారం కూడా ఉండేది. దాని ద్వారానే కాంట్రాక్టర్‌కు గరిష్ఠంగా దాయం సమకూరేది. 2021లో కూరగాయల హెూల్‌సేల్ వ్యాపారాన్ని గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోకి మార్చడంతో వ్యాపారులు తైబజార్ చెల్లించడం నిలిపివేశారు.

## అకాల వర్షంతో ఆగమైన రైతులు
### పలుచోట్ల ధ్వంసమైన తోటలు, పొలాలు



**సిద్దిపేట :** అకాల వర్షం.. రైతన్నలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. సిద్దిపేట జిల్లాలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో పాటు జోరుగా వర్షం కురిసింది. ఆ వెంటనే వడగళ్లు పండడంతో కాసేపు జనజీవనం అతలాకుతల మైంది. సిద్దిపేట పట్టణంలో పది నిమిషాల వ్యవధిలో పలుచోట్ల చెట్లు నేలకూలాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. 30కి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. రహదారులపై వరద నీరు పోటెత్తింది. సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, తొగుట, చిన్నకోడూరు, నంగునూరు, రాయపోల్, గజ్వేల్, కోహెడ, దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో వడగళ్ల వర్షం కురవడంతో వరి, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. యాసంగి పంట సాగుచేస్తున్న రైతులను వడగళు ఏటా వెంటాడుతూనే ఉన్నాయి. ఐదేళ్లలో ఈ పరిస్థితులను కాస్త అధిగమించినప్పటికీ గతేడాది కూడా ఇదే విధమైన నష్టం వాటిల్లింది. దిగుబడికి సిద్ధంగా ఉన్న మామిడి తోటలపైనా వడగళ్ల ప్రభావం పడింది. ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలాయి. అయితే పంటలు, తోటలకు జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షానికి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలు లకు చెట్లు విరిగి స్తంభాలపై పడ్డాయి. వీటిని పునరుద్ధరించే వరకు ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ధ్వంసమైన ఇళ్లకు సంబంధించి నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరారు. రెవెన్యూ అధికారులు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడగళ్ల బీభత్సం గురించి తెలిసిన వెంటనే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హుటాహుటీన జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు.

# అశ్లీల సైట్లలో ఇటలీ ప్రధాని డీప్‌ఫేక్ వీడియోలు...




రోమ్: ఇటలీ ప్రధాని జార్జియా మెలోని డీప్‌ఫేక్ కంటెంట్‌కు వ్యతిరేకంగా ఉద్యమం మొదలుపెట్టారు. స్వయంగా తానే బాధితురాలినంటూ మీడియా ముందుకు వచ్చారామె. అంతేకాదు.. ఆ వీడియోలను అప్‌లోడ్ చేసిన వ్యక్తులపై లక్ష యూరోలకు పరువు నష్టం దావా వేశారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని పేరిట వీడియోలు అశ్లీల సైట్లలో అప్‌లోడ్ అయ్యాయి. ఓ పోర్న్‌స్టార్ ముఖానికి మెలోనీ ముఖాన్ని డీప్‌ఫేక్ టెక్నాలజీతో మార్ఫింగ్ చేసి ఆ వీడియోలను అప్‌లోడ్ చేశారు ఇద్దరు. ఆ వీడియోలను అమెరికాలో గత కొన్ని నెలలుగా కొన్ని లక్షల మంది వీక్షించారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఆమె సత్వరమే స్పందించారు. ఆ ఇద్దరిపై లక్ష యూరోల(మన కరెన్సీలో 90 లక్షల రూపాయల దాకా) పరువు నష్టం దావా వేశారామె. ఈ కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం జులై 2వ తేదీన ఆమె కోర్టుకు హాజరు కానున్నారు. ఇక.. ప్రధాని లాంటి ఉన్నత పదవిలో ఉన్న తానే డీప్‌ఫేక్‌కు వ్యతిరేకంగా ముందుకు వచ్చానని, బాధితులు ముందుకు వచ్చి ధైర్యంగా పోరాడాలని ఆమె పిలుపు ఇచ్చారు. ఇక ఈ కేసులో నిందితుల నుంచి తీసుకునే పరిహారాన్ని హింసకు గురైన మహిళలకు విరాళంగా మెలోనీ ఇస్తారని ప్రధాని లీగల్ టీం ప్రకటించింది. నిందితులను తండ్రీ కొడుకులుగా(40, 72 ఏళ్లు) గుర్తించిన దర్యాప్తు అధికారులు.. స్మార్ట్ ఫోన్ ద్వారా ఆ వీడియోలను అప్‌లోడ్ చేసినట్లు నిర్ధారించారు. అయితే.. మెలోనీ ప్రధాని కాకముందే 2022లో ఆ వీడియోలు అప్‌లోడ్ కావడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఇటలీ చట్టాల ప్రకారం ఇలాంటి పరువు నష్టం దావాలు తీవ్రంగా నేరాలుగా పరిగణించబడ్డాయి. బాధితులకు పరిహారం ఇప్పించడంతో పాటు నిందితులకు జైలు శిక్ష విధిస్తారు కూడా.

## వారు వీరవుతున్నారు

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో రానున్న రోజుల్లో వలసలు పెరిగే ఆవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల నుంచి చేరేందుకు కీలక నేతలు ఆసక్తి చూపుతున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు మరిన్ని వలసలు కొనసాగే అవకాశం ఉంది. నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల్లో వేరే పార్టీల నుంచి పోటీ చేస్తున్నారు. ఆ మేరకు ఆయా పార్టీలు ఇప్పటికే కొంతమందికి టికెట్లు ఖరారు చేయగా, మరికొంతమంది త్వరలోనే టికెట్లు ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్ సిట్టింగ్ ఎంపి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల స్థానానికి బరిలో దిగగా, బిఎస్‌పి నుంచి నాగర్‌కర్నూల్‌లో పోటీచేయాలనుకున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ బిఆర్ఎస్ నుంచి బరిలో నిలిచారు. అలాగే బిఆర్ఎస్ సిట్టింగ్ ఎంఎల్ఎ దానం నాగేందర్ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తుండగా, రంగారెడ్డి జెడ్‌పి చైర్మన్ సునీత మహేందర్‌రెడ్డి ఉన్న బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి మల్కాజిగిరి స్థానం బరిలో దిగారు. జహీరాబాద్ సిట్టింగ్ ఎంపి బీబీ పాటిల్ బిఆర్ఎస్ నుంచి బిజెపిలో చేరి అదేస్థానం నుంచి బిజెపి తరపున పోటీ చేయనుండగా, బిఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రాములు బిజెపి చేరగా ఆయన కుమారుడు భరత్ ప్రసాద్‌ను ఎంపీ బరిలో నిలిపారు. అదేవిధంగా, బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ సైదిరెడ్డి బిజెపిలో చేరిన ఆ పార్టీ తరపున నల్గొండ స్థానానికి పోటీ చేస్తుండగా, బిఆర్ఎస్ నుంచి బిజెపి చేరిన గోండు నగేష్ అదిలాబాద్ లోక్‌స్థానం నుంచి బరిలోకి దిగారు. మాజీ ఎంపి సీతారాంనాయక్ బిఆర్ఎస్ నుంచి బిజెపిలోకి వెళ్లి ఆ పార్టీ తరపున మహబూబాబాద్ స్థానం పోటీ చేస్తున్నారు. ఆ మేరకు ఇటీవల పార్టీ మారిన నేతలకు ఆయా పార్టీలు టికెట్లు ఖరారు చేశాయి. బిఆర్ఎస్ ఎంపీగా గెలిచిన జితేందర్‌రెడ్డికి గత పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిత్వం దక్కకపోవడంతో బిజెపిలో చేరారు. ఈసారి అక్కడ అభ్యర్థిత్వం దక్కకపోవడంతో మరోసారి పార్టీ మారారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ బిజెపి అభ్యర్థిగా పోటీచేసిన కుమారుడు మిథున్‌రెడ్డితో కలిసి జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. జితేందర్ రెడ్డికి ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి హోదా ఇచ్చి పార్టీలోకి ఆహ్వానించింది. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ఛైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి అనుచరగణంతో బిఆర్ఎస్ పార్టీని వీడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. స్వర్ణ సుధాకర్ గతంలో ఎంఎల్ఎ పనిచేశారు. వివిధ పార్టీలనుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు, రాజకీయ భవిష్యత్ కోసం ఇతర పార్టీల్లో చేరుతున్నారు. రాజకీయ నేతల పార్టీల మార్పుతో రాష్ట్రంలో రాజకీయాలు వేగంగా మారిపోయాయి. ఎప్పుడు ఎవరు పార్టీ మారతారో ఎవరు పార్టీలో ఉంటారో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలకే తెలియడం లేదు.

## ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి కీలకం




న్యూఢిల్లీ : ప్రతిపక్ష ఇండియా కూటమికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. అయితే కూటమిలోని అన్ని పార్టీలూ తమ స్థాయికి తగిన విధంగా కృషి చేయాలని, అంతా దాని పైనే ఆధారపడి ఉన్నదని చెప్పారు. ఇవి దేశ మనుగడకు సంబంధించిన ఎన్నికలని వ్యాఖ్యానించారు. 'మనం మన లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని కాపాడుకుంటామా లేదా అనే విషయాన్ని ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయి. ఎందుకంటే గత పది సంవత్సరాల్లో అనేక తీవ్రమైన ఉల్లంఘనలు జరిగాయి. దీనిని రాజ్యాంగ విలువల పైన, రాజ్యాంగ మూల స్తంభం పైన జరిగిన దాడిగా నేను భావిస్తాను. లౌకిక ప్రజాస్వామ్యం అనేది ఓ మూల స్తంభం. ఆర్థిక సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజం అనేవి ఇతర స్తంభాలు' అని వివరించారు.

## మే నాటికి ఉత్తర గాజాలో ఆందోళనకర పరిస్థితులు



గాజా : గాజాలోని 20లక్షల మంది ప్రజానీకం ఏదొక స్థాయిలో తీవ్రమైన ఆహార అభద్రతను, తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గాజాలో తక్షణమే మానవతా సాయం పెరగకపోయినా, కాల్పుల విరమణ జరగకపోయినా మే నాటికి ఉత్తర గాజా దుర్భిక్షం బారిన పడుతుందని ఇప్పటికే ఐక్యరాజ్య సమితి సంస్థలు హెచ్చరించాయి. పైగా సుదీర్ఘకాలంలో తీవ్ర అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడం ఖాయమని పేర్కొన్నాయి. సూడాన్, ఆఫ్ఘనిస్తాన్‌దేశాల్లో వరుసగా 80, 70శాతం ప్రజలు ఇలాంటి ఆహార సంక్షోభాలను ఎదుర్కొంటుండగా, గాజాలో మాత్రం వంద శాతం ప్రజలు ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అమెరికా కూడా ఈ విషయాన్ని మొదటిసారిగా అంగీకరించింది. తక్షణమే గాజా ప్రజలకు ఆహారాన్ని అందించడమే ప్రథమ ప్రాధాన్యతగా వుండాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ స్పష్టం చేశారు. గాజాలో నెలకొన్న క్షామ పరిస్థితులు పూర్తిగా మానవ తప్పిదాలని, పైగా నివారించదగినవని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ స్పష్టం చేశారు. గాజా ప్రజలకు ఆహారం అందకుండా ఇజ్రాయిల్ విధిస్తున్న ఆంక్షలు యుద్ధ నేరం కిందకే వస్తాయని ఆయన హెచ్చరించారు. గతంలో గాజాలో ఐదేళ్ళలోపు చిన్నారుల్లో 0.8శాతం మంది తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతుండగా, గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న దాడుల పర్యవసానంగా ప్రస్తుతం ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 12.4 శాతం నుండి 16.5శాతం మధ్య వుందని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) తాజా విశ్లేషణలో వెల్లడైంది. ఆహారం, నీరు, ఇతర నిత్యావసరాల సరఫరా తక్షణమే పెరగని పక్షంలో పరిస్థితులు ఇంకా దిగజారడం ఖాయమని పేర్కొంది. ప్రస్తుతం అనేక కుటుంబాలు రోజువారీ తినడాన్ని మానేయగా, చాలా కుటుంబాల్లో పిల్లలు తినడానికి వీలుగా పెద్దలు తినడం మానేస్తున్న హృదయ విదారక దృశ్యాలు సర్వ సాధారణమైపోయాయి. దీనివల్ల సుదీర్ఘకాలంలో వేలాదిమంది ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

## కావాలనే వివాదం సృష్టిస్తున్నారు...!



న్యూఢిల్లీ : ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే సెలక్షన్ కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించే ఎన్నికల ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామక చట్టం – 2023ను కేంద్రంసమర్థించుకొన్నది. పిటిషనర్లు కావాలనే వివాదం సృష్టిస్తున్నారని పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ చట్టం ప్రకారం కొత్త ఎన్నికల కమిషనర్లను నియమించొద్దని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు వచ్చే ముందు రోజే(మార్చి 14న) హడావుడిగా ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించారన్న పిటిషనర్లు వాదనను న్యాయశాఖ వ్యతిరేకించింది. సెలక్షన్ కమిటీ ఫలానా పద్ధతిలో ఉంటేనే ఏ సంస్థ స్వతంత్రత అయినా కొనసాగుతుందనడం సరికాదని పేర్కొన్నది. ఈసీ అయినా, మరే సంస్థ స్వతంత్రతైనా సెలక్షన్ కమిటీలో జ్యుడీషియల్ సభ్యుడు ఉండటంపై ఆధారపడి ఉండదని న్యాయశాఖ పేర్కొన్నది.

## అమెరికా జోక్యందారీ విధానాలపై క్యూబా నిరసన

హవానా : క్యూబాపై క్రూరమైన ఆర్థిక యుద్ధాన్ని కొనసాగించడం, దాంతో ప్రజల్లో సహజంగానే నెలకొనే చిరాకులను ఎగదోయడం, దేశాన్ని అస్థిరపరిచే కుట్రలను అంతకంతకూ తీవ్రతరం చేయడం వంటి అమెరికా దాష్టీకాలపై క్యూబా తన తీవ్ర నిరసన తెలియజేసింది. . క్యూబన్లలో అసమ్మతిని రెచ్చగొట్టేందుకు అమెరికా ఏటా తన బడ్జెట్‌లో వందల కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నది. క్యూబా ప్రభుత్వంపై బురద చల్లేందుకు గోబెల్స్ ప్రచారాన్ని అమెరికా ప్రభుత్వం, క్యూబాలోని అమెరికన్ ఎంబసీ అదేపనిగా సాగిస్తున్నది. ఆ దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోంది. రెండు రోజుల క్రితం తూర్పు క్యూబాలోని శాంటియాగో సిటీలో నిరసనల వెనుక అమెరికా హస్తం ఉందని జోర్గెట్ అనే సంస్థ తెలిపింది. క్యూబా అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చుతున్నందుకు హవానాలోని అమెరికా దౌత్యాధికారి బెంజిమిన్ జెఫ్‌ను పిలిపించి క్యూబా ప్రభుత్వం తన నిరసన తెలిపింది.




## ఏకపక్షంగా లేని ఏపీ రాజకీయం


ఆంధ్రప్రదేశ్లో రాజకీయాలు ఈ సారి ఎవరి అంచనాలకూ అందని విధంగా ఉన్నాయి. వివిధ సంస్థల సర్వేల ఫలితాలు నమ్మే విధంగా లేవు. ఆయా పార్టీల తరపున ఆ సర్వేలు ప్రకటిస్తున్నట్లుంది. టీడీపీ బీజేపీ, జనసేనతో జతకట్టి పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ సీపీఐ, సీపీఎంల పొత్తుతో పోటీ చేస్తోంది. వైసీపీ మాత్రం గతంలో మాదిరే ఒంటరిగానే పోటీ చేస్తోంది. ఎన్నికలంటే విమర్శలు, ప్రతి విమర్శలు, వ్యక్తిగత విమర్శలు తారాస్థాయిలో వస్తుంటాయి. ఈ మధ్య కాలంలో ఏపీలో రాజకీయ విమర్శల్లో భరించలేని బండ బూతులు కూడా వచ్చేశాయి."ఈ ఎన్నికలు ధనవంతులకు, పేదలకు మధ్య యుద్ధం.. తాము సిద్ధం" అని వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంటున్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం వైసీపీని ఓడించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చారు. అయితే, ఈ సారి ఎన్నికల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి, రాజధాని అమరావతి, మూడు రాజధానుల అంశాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని మనకు స్పష్టంగా తెలుస్తోంది. వివిధ పార్టీల ఆలోచనలు క్లుప్తంగా పరిశీలించినట్లయితే.. 'సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన పేదలతోపాటు క్రైస్తవులు, ముస్లింలు, బీసీలు,ఎస్టీలు, ఎస్సీలు, కాపులు, సీఎం సామాజిక వర్గం వారు, వాలంటీర్లు, సచివాలయాల సిబ్బంది మాకు ఓట్లు వేస్తారు. బీసీ, ఎస్టీ,ఎస్సీలలోని అన్ని కులాల వారిని గుర్తించి, ప్రభుత్వంలో వారికి సముచిత స్థానం కల్పించాం. ఉప ముఖ్యమంత్రి దగ్గర నుంచి రాజ్యసభ, శాసన మండలి సభ్యుల పోస్టులు, నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో సామాజిక న్యాయం పాటించాం. అభివృద్ధి వికేంద్రీకరణ, మూడు రాజధాలకు కట్టుబడి ఉన్నాం. లోక్ సభ, శాసనసభ సీట్ల విషయంలో కూడా బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమేగాక, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలు, మహిళల విషయంలో కూడా సామాజిక న్యాయం పాటించాం. వారికి 50 శాతం సీట్లు కేటాయించాం. ఇవే మమ్మల్ని రెండోసారి విజయతీరాలకు చేరుస్తాయి. అని వైసీపీ భావిస్తోంది. "ఉద్యోగులు, పోలీసులు, ఉపాధ్యాయులు, బీసీలు, ఎస్టీలు, ఎస్సీలు, కాపులు, చంద్రబాబు సామాజిక వర్గం వారు, మధ్య, ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారు మాకు ఓట్లు వేస్తారు. అలాగే మూడు రాజధానుల పేరుతో ఏపీకి రాజధాని ఏదో చెప్పలేని పరిస్థితి, అమరావతితో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిన అంశం, వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, ఇసుక, మద్యం, మైనింగ్, గంజాయి ద్వారా వైసీపీ నేతలు కోట్ల రూపాయలు గడించారు. అన్ని వర్గాల ప్రజలకు వేధింపులు ఎక్కువైపోయాయి. పోలీసుల రాజ్యం కొనసాగుతోంది. అని టీడీపీ నమ్మకంతో ఉంది. ఈ అంశాలే మమ్మల్ని గెలిపిస్తాయని నమ్మకంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఇక కాంగ్రెస్ పార్టీని ఏపీలో పెద్దగా లెక్కలోకి తీసుకోవలసిన అవసరం లేదు. పార్లమెంట్ తలుపులు మూసి, చర్చ లేకుండా, అన్యాయంగా రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ విభజించిందన్న అభిప్రాయంతో ఏపీ ప్రజలు ఉన్నారు. అలాగే, కమ్యూనిస్టుల పరిస్థితి రాష్ట్రంలో బాగా దిగజారిపోయింది. వారు ఒక్క స్థానంలో కూడా గెలిచే పరిస్థితి లేదు. రాజకీయ, సామాజిక, ట్రేడ్ యూనియన్, విద్యార్థి యూనియన్, అన్ని వర్గాలలో ఉద్యమాల తీవ్రత తగ్గడం, అత్యధిక మంది నేతల ప్రవర్తన తదితర కారణాల వల్ల సీపీఐ, సీపీఎం బాగా క్షీణించాయి. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తుల విషయానికి వస్తే అనేక విమర్శలు తలెత్తుతున్నాయి. బీజేపీతో పొత్తు పెట్టుకోవడం టీడీపీలో, రాష్ట్ర ప్రజలలో ఎక్కువ మందికి ఇష్టం లేదు. ఈ పొత్తు వల్ల ముస్లింలు అత్యధిక మంది టీడీపీకి దూరమయ్యే అవకాశం ఉంది. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ.. వంటి అంశాలు విషయంలో రాష్ట్ర ప్రజలు బీజేపీ అంటే మండిపడుతున్నారు. అంతే కాకుండా, వైసీపీతో బీజేపీకీ లోపాయకారి ఒప్పందం ఉందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్న సీఎం జగన్మోహన్ రెడ్డి అరెస్టు కాకపోవడానికి, కనీసం కోర్టుకు హాజరు కాకపోవడానికి కూడా బీజేపీ మద్దతే కారణంగా భావిస్తున్నారు. అంతేకాకుండా, చిలకలూరిపేట ప్రజాగళం సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీఎం జగన్మోహన్ రెడ్డిని ఒక్క మాట కూడా అనకపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఇక సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన విషయంలో జనసేన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కాపు వర్గం నుంచి కూడా జనసేనకు అనుకున్న స్థాయిలో మెజార్టీ లభించే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ఆ సామాజిక వర్గం నుంచి ముద్రగడ పద్మనాభం వంటి ముఖ్యనేతలు వైసీపీలో చేరారు. ఆ ప్రభావం ఎన్నికలపై పడే ప్రమాదం లేకపోలేదు. వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తున్నప్పటికీ, అభ్యర్థులను మార్చడం, మళ్లీ మార్చడం, ప్రకటించడంలో జాప్యం వంటి అంశాలు ఎన్నికలలో ప్రభావం చూపే అవకాశం ఉంది. ఓట్లు వేయడానికి క్యూలలో నిలబడే ఓపిక ఉన్న పేద వర్గాలు ఎక్కువగా వైసీపీకే వేసే అవకాశం ఉంది. అయితే, ఉద్యోగ, ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారు కూడా ఓపిక చేసుకుని క్యూలో నిలబడి ఓట్లు వేస్తే టీడీపీ కూటమి లాభ పడే అవకాశం ఉంది. ఓటింగ్ శాతం పెరిగితే మాత్రం టీడీపీకే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే, ఈ సారి ఎన్నికలు గతంలో మాదిరి ఏకపక్షంగా ఉండే అవకాశం మాత్రం లేదు. ఎవరినీ తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. ఎవరి బలాబలాలు వారికి ఉన్నాయి. ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయారు. అభివృద్ధి, సంక్షేమం కంటే కులాల ప్రభావం కూడా ఎప్పటి మాదిరిగానే ఈ సారి కూడా ఉంటుంది. ఈ ఎన్నికలు చాలా పోటాపోటీగా జరుగుతాయి. మరీ అంత మితిమీరిన నమ్మకం ఎవరికీ పనికిరాదు. పొగరు తలకెక్కితే మాత్రం ప్రమాదం!

# ఆవు పాలతో ఇన్సులిన్.. అధ్యయనాల్లో కొత్త విషయాలు



హిందూ మతంలో ఆవును లక్ష్మీ దేవిగా భావించి పూజలు చేస్తుంటారు. ఎంతో పవిత్రమైన ఆవు పాల నుంచి వచ్చే ఉత్పత్తులకు కూడా మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది.అలాగే ఆవు పేడ, ఆవు మూత్రం, పాలు ఎంతో పవిత్రమైనదని నమ్ముతారు. ఇంతటి పవిత్రమైన ఆవుపాల పై చేసిన పరిశోధనల్లో వెలువడిన కొన్ని విషయాలు ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆవుపాలు ప్రపంచంలో ఏర్పడిన ఇన్సులిన్ కొరతను పరిష్కరిస్తుందని ఈ అధ్యయనంలో వెల్లడించారు. స్వచ్ఛమైన ఆవుపాలలో ఇన్సులిన్ తయారీకి అవసరమైన ప్రొటీన్‌లు ఉత్పత్తి చేయగల శక్తి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1921 వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా ఇన్సులిన్ ను కనుగొన్నారు. ఈ ఇన్సులిన్ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ముఖ్యమైన ఔషధం. అప్పటి కాలంలో పంది, ఇతర జంతువుల ప్యాంక్రియాస్ నుంచి తీసకున్న ఇన్సులిన్‌తో చికిత్స అందించేవారు. కాగా 1978వ సంవత్సరంలో మొదటిసారిగా %జు% కోలి బ్యాక్టీరియా నుంచి ప్రొటీన్లను తీసుకుని ఇన్సులిన్ ను ఉత్పత్తి చేశారు.అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతగానో ఉపయోగపడే ఇన్సులిన్ సప్లిమెంటేషన్ కోసం ఆవులను అధ్యయనం చేయడం ఇది మొదటిసారి మాత్రం కాదు. ఇంతకు ముందు కూడా ఇన్సులిన్‌కు అవసరమైన ప్రోటీన్ లు ఆవుపాలలో ఉన్నాయని తెలిసి అధ్యయనాలు చేశారు. చికాగోలో ఉన్న యూనివర్శిటీ ఆఫ్ ఇల్లినాయిస్ అర్బానా - ఛాంపెయిన్‌లోని జంతు శాస్త్రవేత్త నిపుణుల నేతృత్వంలోని పరిశోధనా బృందాలు పరిశోధనలు చేశాయి. ప్రో-ఇన్సులిన్ కోసం కోడ్ చేసే మానవ DNA ను 10 ఆవు పిండాల కణ కేంద్రకంలోని నిర్దిష్ట భాగాన్ని చొప్పించారు. అలాగే దాన్ని సాధారణ ఆవుల గర్భాశయంలోకి చొప్పిస్తారు. దీంతో ఆ ఆవుకి జన్యుమార్పిడితో దూడ జన్మిస్తుంది. అయితే ఈ విధంగా ఆవును గర్భవతిని చేసే ప్రయత్నాలు చాలావరకు విఫలమయ్యాయి. దాని తరువాత సావో పాలో విశ్వవిద్యాలయంలోని ఓ జంతువుల పెంపకం సాంకేతిక నిపుణుడు ఇలాంటి ప్రయత్నం చేసి విజయం సాధించారు. హార్మోనల్ ఇండక్షన్ పద్ధతితో ఆవుకు గర్భం తెచ్చి దాని నుండి పాలను ఉత్పత్తి చేయడం సాధ్యమవుతుందని నిరూపించారు. ఆవుపాలలో ప్రొటీన్లు అత్యధికంగా ఉండాలంటే అది గర్భవతి అయి ఉండాలని తెలిపారు.

# వీటిని తింటే క్యాన్సర్ నుంచి బయటపడొచ్చు....?




క్యాన్సర్ అనేది ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణమైన జబ్బులో ఒకటిగా నిలిచిపోయింది.ఇది ఈ రోజుల్లో చాలా కామన్ అయిపోయింది.కొన్ని జీవనశైలి మార్పులతో పాటు ముందస్తుగా వ్యాధిని గుర్తించి ఈ ప్రాణాంతక సమస్య నుంచి బయటపడవచ్చు. ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల పెద్దప్రేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం భారీగా తగ్గుతుంది. ఫైబర్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడటమే కాదు.. అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.అవిసె గింజల్లో ఫైబర్ ఉంటుంది. ఫైబర్ బూస్ట్ కోసం స్మూతీస్, పెరుగు లేదా కాల్చిన వస్తువులకు అవిసె గింజలను కలిపి తీసుకోండి. ఈ హై-ఫైబర్ ఆహారాలను మీ ఆహారంలో చేర్చడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. అయితే, మీ వ్యక్తిగత ఆరోగ్య సమస్యల ఆధారంగా వైద్యుల సలహాలతోనే ఆహారాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.అలాగే ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలకు బదులుగా ధాన్యపు పాస్తా, బ్రెడ్‌ను ఎంచుకోండి. ఆర్టిచోక్‌లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. క్యాన్సర్ నిరోధక లక్షణాల సమ్మేళనాలను కలిగి ఉంటుంది. ఆవిరిలో ఉడికించి, కాల్చిన లేదా సలాడ్‌లలో కలుపుకుని తీసుకోవచ్చు.బాదం, చియా గింజలు, గుమ్మడి గింజలు ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి. అదనపు ఫైబర్ బూస్ట్ కోసం సలాడ్లు, పెరుగు లేదా వోట్మీల్ మీద చల్లుకోని తినవచ్చు.ఇంకా అలాగే బ్రోకలీ, బ్రస్సెల్స్ మొలకలు, క్యారెట్లు, బచ్చలికూర, చిలగడదుంపలు వంటి వివిధ రకాల కూరగాయలను మీ ఆహారంలో చేర్చుకోండి.ఆపిల్స్, బెర్రీలు, బేరి, నారింజ, అరటి వంటి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. పూర్తి ఫైబర్ కంటెంట్ పొందడానికి పండ్ల రసాల కన్నా మొత్తం పండ్లను తినండి. గోధుమలు, ఓట్స్, బార్లీ, క్వినోవా, బ్రౌన్ రైస్ వంటి ఆహారాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలకు శుద్ధి చేసిన ధాన్యాల కన్నా తృణధాన్యాలను తీసుకోవడం మంచిది.బీన్స్, కాయధాన్యాలు, చిక్‌పీస్, బఠానీలు ఫైబర్ అధిక మొత్తంలో లభిస్తాయి. ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు వంటి ఇతర పోషకాలను కూడా కలిగి ఉంటాయి.

# సోంపు గింజల ఆరోగ్య ప్రయోజనాలు.!



సోంపు గింజల నీళ్లను తాగుతున్నారా? ప్రతిరోజూ ఈ సోంపు గింజల నీళ్లను తీసుకోవడం ద్వారా అనేక అరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ సోంపు గింజలను ఫెన్నెల్ సీడ్స్ వాటర్, ఫెన్నెల్ టీ లేదా ఫెన్నెల్-ఇన్ఫ్యూజ్డ్ వాటర్ అని కూడా పిలుస్తారు. ఈ గింజలలో బయోయాక్టివ్ కాంపౌండ్స్ కారణంగా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మీ ఆహారంలో సోంపు గింజల వాటర్‌ను చేర్చుకోవడం ద్వారా సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించవచ్చు. సోంపు గింజల నీటిని తీసుకోవడం వల్ల కలిగే 8 ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. 1. జీర్ణ చికిత్స : సోంపు గింజలలో అనెథోల్ వంటి నూనెలను కలిగి ఉంటాయి. జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. జీర్ణక్రియలో సాయపడతాయి. ఉబ్బరం తగ్గడమే కాకుండా మృదువైన ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. తద్వారా మలబద్ధకం నుంచి ఉపశమనం పొందవచ్చు. 2. గ్యాస్, ఉబ్బరం తగ్గిస్తుంది : సోంపు గింజలలో కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటాయి. జీర్ణశయాంతర ప్రేగులలోని కండరాలను కదిలించడంలో గ్యాస్, ఉబ్బరాన్ని తగ్గించడంలో సాయపడతాయి. 3. అజీర్ణం, గుండెల్లో మంటకు ఉపశమనం : సోంపు గింజల నీటిలో మంటను తగ్గించే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. జీర్ణవ్యవస్థలో కలిగే ఎసిడిటీని తగ్గించడం ద్వారా అజీర్ణం, గుండెల్లో మంటను తగ్గించడంలో సాయపడతాయి. 4. రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది : కొన్ని అధ్యయనాల ప్రకారం.. సోంపు గింజలలోని సమ్మేళనాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి. భోజనం తర్వాత రక్తంలో చక్కెరను తగ్గించడంలో సాయపడతాయని సూచిస్తున్నాయి. మధుమేహం ఉన్న వ్యక్తులకు లేదా డయాబెటిస్ రిస్క్ ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. 5. బరువు తగ్గుతారు : సోంపు గింజల వాటర్ తీసుకోవడం వల్ల ఆకలి తగ్గుతుంది. జీవక్రియను పెంచడంలోనూ బరువు తగ్గడంలోనూ సాయపడుతుంది. అదనంగా, మూత్రవిసర్జన సాఫీగా ఉంటుంది. కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. 6. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది : సోంపు గింజలలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. సోంపు గింజల నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వయస్సు-సంబంధిత మచ్చలు తగ్గుతాయి. ఇతర కంటి అనారోగ్య సమస్యల నుంచి రక్షణ పొందవచ్చు. 7. రోగనిరోధక శక్తిని పెంచుతుంది : విటమిన్ సి, ఐరన్ వంటి సోంపు గింజలలో ఉండే విటమిన్లు, ఖనిజాలు ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడతాయి. సోంపు గింజల నీటిని తీసుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్లు, అనారోగ్యాల నుంచి రక్షణ అందిస్తుంది.

# గుండెపోటు వచ్చే ముందు......!



నేటి కాలంలో మనలో చాలా మంది కూడా గుండె సంబంధిత సమస్యలతో ఎంతగానో బాధపడుతున్నారు.చాలా చిన్న వయస్సులోనే గుండె పోటు సమస్యతో మరణిస్తున్నారు. జిమ్ చేస్తూ, డాన్స్ చేస్తూ చాలా మంది ఆరోగ్యవంతులు కూడా చాలా చిన్న వయస్సులోనే మరణిస్తున్నారు.అయితే గుండె సమస్యలు రావడానికి ముందు ఖచ్చితంగా కొన్ని సంకేతాలు కనిపిస్తాయి.అవేంటో తెలుసుకొని ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఈజీగా గుండె సమస్యలు తగ్గించుకోవచ్చు.గుండె సమస్యలతో బాధపడే వారు బరువు ఎక్కువగా పెరుగుతారు. ఆకస్మికంగా బరువు పెరగడాన్ని గమనించినట్లయితే నిర్లక్ష్యం చెయ్యవద్దు. ఇక ఈ సమస్యతో బాధపడే వారిలో ఆకలి వేయడం తగ్గుతుంది. వికారంగా ఉంటుంది.అలాగే గుండె వైఫల్యం చెందుతున్నప్పుడు దగ్గు ఎక్కువగా వస్తుంది. దగ్గుతో పాటు తెల్లటి లేదా గులాబి రంగులో ఉండే శ్లేష్మం కూడా వస్తుంది. ఇది కూడా గుండె వైఫల్యానికి సంకేతంగా భావించాలి. అదేవిధంగా సిహెచ్ఎఫ్ తో బాధపడే వారిలో పొట్టలో నీరు చేరి పొట్ట ఉబ్బినట్టుగా ఉంటుంది. ఈ సమస్యను కూడా మనం గుండె వైఫల్యానికి హెచ్చరికగా భావించాలి.సమస్యతో బాధపడే వారిలో శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బందిగా ఉంటుంది. మెట్లు ఎక్కేటప్పుడు, వేగంగా నడిచేటప్పుడు, శారీరక శ్రమ చేసేటప్పుడు ఊపిరి తీసుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. శ్వాస తీసుకోవడానికి శ్రమించాల్సి ఉంటుంది. అలాగే చిన్న చిన్న పనులకే శరీరం అలిసిపోయినట్టుగా అవుతుంది. విపరీతమైన అలసట, నీరసం వంటి లక్షణాలను మనం గమనించినట్టయితే ఇది గుండె వైఫల్యానికి గుర్తుగా భావించాలి. సిహెచ్ఎఫ్ తో బాధపడే వారిలో పాదాలు, కాళ్ళు, చీలమండలంలో నీరు చేరి అవి ఉబ్బిపోతాయి. అలాగే పొత్తి కడుపు కూడా నీరు చేరి లావుగా తయారవుతుంది. అదేవిధంగా గుండెలయ దెబ్బతింటుంది. గుండె దడగా ఉంటుంది. గుండె క్రమరహితంగా కొట్టుకుంటుంది. కొన్నిసార్లు గుండె కొట్టుకునే శబ్దం కూడా మనకు వినిపిస్తుంది. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యున్ని సంప్రదించడం చాలా అవసరం. ఇక మనం రోజూ చేసే వ్యాయామాలు కూడా సరిగ్గా చేయలేకపోతాము.వ్యాయామం చేయడం కష్టతరంగా మారుతుంది. అలాగే శ్వాస తీసుకునేటప్పుడు గురక లేదా ఎక్కువగా శబ్దాలు వస్తూ ఉంటాయి. ఈ లక్షణం కనిపించిన వెంటనే గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. ఇక ఈ సమస్యతో బాధపడే వారిలో ఆకలి వేయడం తగ్గుతుంది. వికారంగా ఉంటుంది. అలాగే గుండె వైఫల్యం చెందుతున్నప్పుడు దగ్గు ఎక్కువగా వస్తుంది. దగ్గుతో పాటు తెల్లటి లేదా గులాబి రంగులో ఉండే శ్లేష్మం కూడా వస్తుంది.

# పెరుగు, బెల్లం కలిపి తినడం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలు...!



మనం తరచూ పెరుగును ఉపయోగిస్తూనే ఉంటాము. మజ్జిగ లేదా పెరుగన్నం అలాగే అనేక రకాల వంటల్లో కూడా పెరుగును ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఈ పెరుగును ఎంత తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది.అలా అని ఎక్కువగా తీసుకుంటే మాత్రం సమస్యలు తప్పవు. కొందరు పెరుగులోకి ఉప్పు వేసుకొని మజ్జిగ చేసుకుని తాగితే మరి కొందరు చక్కెర వేసుకొని లస్సీ చేసుకొని తాగుతూ ఉంటారు. అయితే దీని కంటే పెరుగులో బెల్లం కలిపి తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి అంటున్నారు పోషకాహార నిపుణులు. పెరుగు, బెల్లాన్ని కలిపి తీసుకోవడంవల్ల క్యాల్షియం లభిస్తుంది. దంతాలు, ఎముకలు బలంగా మారతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది. గుండెకు సంబంధించి ఎటువంటి అనారోగ్య సమస్యలు రావు.

# షుగర్ పేషెంట్లు పిస్తాని తినవచ్చ..?



డ్రైఫ్రూట్ శరీరానికి చాలా మేలు చేస్తాయి.. ఈ ముఖ్యంగా డ్రైఫ్రూట్లో ఒకటైన పిస్తా కూడా మంచి ఉపయోగాలను అందిస్తాయి. ఇందులో ఉండేటువంటి ప్రోటీన్లు ఫైబర్ కొవ్వు పదార్థాలు మన శరీరానికి చాలా అవసరం. కొంతమంది పిస్తా పప్పు తినడం వల్ల షుగర్ పెరుగుతుందని అపోహ కూడా ఉంటుంది. మరి పిస్తా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు ఒకసారి మనం చూద్దాం..

పిస్తా తినడం వల్ల సాధారణంగా ఆకలి వేయదు ఎక్కువసేపు కడుపు నిండేలా చేస్తాయట. పిస్తా లో ఉండేటువంటి ఆరోగ్యము కరమైన ప్రోటీన్లు కొవ్వు పదార్థాలు ఫైబర్ వంటివి పుష్కలంగానే లభిస్తాయి. రక్తంలో ఉండేటువంటి షుగర్ లెవెల్స్ కూడా పెరగనివ్వకుండా నిరోధించడంలో ఇది చాలా ముఖ్యమైన పాత్రను కూడా పోషిస్తాయి.. పిస్తాలో కార్బోహైడ్రేట్లు కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల రక్తంలో ఉండేటువంటి చక్కెర స్థాయిల పైన ఎలాంటి ప్రభావాన్ని కూడా చూపించవట.


# స్వీట్ కార్న్ వల్ల కలిగే ప్రయోజనాలు...



మొక్కజొన్న వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు అన్న విషయం మనందరికీ తెలిసిందే. చిన్నపిల్లల నుంచి పెద్దవారు వరకు ప్రతి ఒక్కరు ఈ మొక్కజొన్నల ఇష్టపడి తింటూ ఉంటారు. అయితే ఇదివరకటి రోజుల్లో మనకు మొక్కజొన్న కేవలం కొన్ని సీజన్ లలో మాత్రమే లభించేది. కానీ ప్రస్తుతం అన్ని సీజన్ లలో ఇవి మనకు లభిస్తున్నాయి. కాగా ఇందులో మాములు మొక్కజొన్నతో పాటు స్వీట్ కార్న్ కూడా లభిస్తూ ఉంటుంది. దీన్ని వంటల్లో కూడా ఉపయోగిస్తారు. వీటిని గింజలు వలిచి వేయించుకొని స్నాక్స్ రూపంలో కొందరు తీసుకుంటూ ఉంటారు. దీన్ని తరుచుగా మన ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. స్వీట్ కార్న్ లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అంతేకాదు కొలెస్ట్రాల్ లెవల్స్ ను కూడా తగ్గిస్తాయి. ఇందులో క్యాలరీలు, ఫ్యాట్ చాలా తక్కువగా ఉంటాయి. దీనివల్ల తిన్నవెంటనే మనకు కడుపు నిండిన భావన కలుగుతుంది. బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. స్వీట్ కార్న్ లో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. లుటీన్, జియాజాంతిన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. స్వీట్ కార్న్ ను తినడంవల్ల కళ్లకు మంచి ఆరోగ్యం. వయసు మీదపడటం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా ఉంటాయి. కంటిచూపు కూడా మెరుగవుతుంది. సంక్లిష్టమైన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి మన శరీరానికి శక్తిని అందిస్తాయి. అలాగే ముఖంపై ముడతలు రావు. ఎప్పుడూ యవ్వనంగా కనిపిస్తుంటారు. అనేక లాభాలను కలిగిస్తున్న స్వీట్ కార్న్ ను తినడం ఇప్పటినుంచే అలవాటు చేసుకోవాలి. ఇందులో ఉండే బీటా కెరోటిన్ శరీరానికి అవసరమయ్యే విటమిన్ ఏ ను అందిస్తుంది. వ్యాధినిరోధకత పెరుగుతుంది. మధుమేహం ఉన్నవారు వివిధ రకాల ధాన్యాలతో పాటు మొక్కజొన్నను కూడా పరిమితంగానే తీసుకోవాలి. 100 గ్రాముల స్వీట్ కార్న్ లో 342 కేలరీలుంటాయి. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచడానికి ఇది సహాయపడుతుంది. కానీ ప్రస్తుతం అన్ని సీజన్ లలో ఇవి మనకు లభిస్తున్నాయి. కాగా ఇందులో మాములు మొక్కజొన్నతో పాటు స్వీట్ కార్న్ కూడా లభిస్తూ ఉంటుంది. దీన్ని వంటల్లో కూడా ఉపయోగిస్తారు.

# టాలీవుడ్ బ్రదర్స్ టైపు

జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన వ్యాఖ్యతో అటు బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించాడు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో బాలీవుడ్, టాలీవుడ్ అన్నదమ్ముల తరహా అని వ్యాఖ్యానించారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. తద్వారా తనలోని సోదరభావాన్ని ప్రకటించాడు. సౌత్ – నార్త్ డిబేట్ నేపథ్యంలో దేశంలోని ఒక పెద్ద పాన్ ఇండియా స్టార్ వ్యాఖ్య ఇప్పుడు ఫిలింసర్కిల్స్ లో హాట్ టాపిక్గా మారింది. జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన వ్యాఖ్యతో అటు బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించాడు. ఇటీవలి ఇంటర్వ్యూలో అల్లు హీరో బాలీవుడ్ తో పోలుస్తూ, దక్షిణ భారత సినిమా ఎదుగుదల డామినేషన్ గురించి జరుగుతున్న చర్చను ఉఠంకించారు. తనకు టాలీవుడ్..బాలీవుడ్ అనే తేడా లేదు. బాలీవుడ్ అంటే అపారమైన గౌరవం ఉందని అల్లు అర్జున్ చెప్పకనే చెప్పాడు. మొత్తం భారతీయ చలనచిత్ర పరిశ్రమను ఒక సంస్థగా భావించే బన్ని బాలీవుడ్ను ఒక చిన్న రఫ్ ప్యాచ్ కోసం విమర్శించడం అన్యాయం. దశాబ్దాలుగా హిందీ పరిశ్రమ మనకు అద్భుతమైన సినిమాలను అందించిందని అన్నారు. ఇరు పరిశ్రమల మధ్య పరస్పర గౌరవం ఉండాలని కోరుకున్నారు. సౌత్– బాలీవుడ్ సినిమాలు ఒకదానితో ఒకటి బాగా ప్రభావితం అవుతాయి. మేం విభిన్న ప్రాంతాల నుండి సోదరులలాగా కలిసి మెలిసి ఒకరికొకరు అపార గౌరవంతో పని చేస్తున్నాం అని వ్యాఖ్యానించాడు. ముంబై కోకిలాబెన్ ఆసుపత్రిలో అమితాబ్ పుష్ప: ది రైజ్చిత్రంతో అల్లు అర్జున్ పేరు ఉత్తరాదినా మార్మోగింది. అతడు ఒక్కో సినిమాతో అనూహ్యంగా ఎదుగుతున్నాడు.15 ఆగస్ట్ 2024న థియేటర్లలోకి రానుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తన పాన్ ఇండియా స్టార్ డమ్ ని మరింత విస్తరిస్తుందని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భావిస్తున్నారు. అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహద్ ఫాజిల్ ఇందులో తమ పాత్రలను పునరావృతం చేస్తారు. దిశా పటాని ఇందులో ప్రత్యేక పాత్రలో నటిస్తోంది. ఈ సీక్వెల్ గంధపు చెక్కల స్మగ్లింగ్ నేపథ్యంలో తెరకెక్కింది.



# అవకాశం సద్వినియోగం చేసుకుందా?

ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్గా పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఈ అమ్మడు తెలుగు లో పలువురు యంగ్ హీరోలతో నటించి మెప్పించింది. అయితే ఈ మధ్య కాలంలో మాత్రం ఈ అమ్మడికి టాలీవుడ్ నుంచి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు. ఇదే సమయంలో బాలీవుడ్ లో ప్రయత్నాలు చేసిన ఈ అమ్మడికి అవకాశాలు దక్కాయి. తాజాగా సిద్దార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందిన యోధ సినిమాలో రాశి ఖన్నా నటించింది. నేడు యోధ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. యోధ సినిమా ఫలితం పై ఆధారపడి రాశి ఖన్నా హిందీ కెరీర్ ఆధారపడి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గత వారం పది రోజులుగా యోధ సినిమా కోసం సిద్దార్థ్ మల్హోత్ర తో కలిసి ఉత్తర భారతంలో ప్రమోషన్ కోసం పలు కార్యక్రమాల్లో పాల్గొంది. ఆ సమయంలో యోధ సినిమా పై రాశి ఖన్నా చాలా నమ్మకం ను వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తర్వాత హిందీలో చేసిన సినిమా అంటూ కూడా ఆమె ప్రచారం చేసింది. బాలీవుడ్ లో యంగ్ స్టార్ హీరో సిద్దార్థ్ మల్హోత్రా తో నటించే అవకాశం ను దక్కించుకున్న ఈ అమ్మడికి సక్సెస్ దక్కి మరిన్ని ఆఫర్లు వస్తాయా అనేది చూడాలి. బాలీవుడ్ లో ఇప్పటికే ఒకటి రెండు సినిమాలు కమిట్ అయ్యిందనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై మరింత స్పష్టత రావాల్సి ఉంది.



# ఆసుపత్రిలో అమితాబ్



అమితాబ్ గుండె మీద కాకుండా అతని కాలులోని గడ్డపై యాంజియోప్లాస్టీ నిర్వహించారని తెలిసినట్టు సదరు కథనం పేర్కొంది. బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఆసుపత్రిలో చేరారు. 81 ఏళ్ల బిగ్ బి ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చేరారని ప్రముఖ జాతీయ మీడియా వెల్లడించింది. అమితాబ్ బచ్చన్ పరిధీయ(పెరిఫెరల్) గుండె కోసం చికిత్స పొందారు.. కరోనరీ హార్ట్ కోసం కాదు! అని కూడా సదరు జాతీయ మీడియా న్యూస్ 18 కథనం వెలువరించింది. అమితాబ్ గుండె మీద కాకుండా అతని కాలులోని గడ్డపై యాంజియోప్లాస్టీ నిర్వహించారని తెలిసినట్టు సదరు కథనం పేర్కొంది. ఆసుపత్రిలో చేరడానికి ఒక గంట ముందు బిగ్ బిలో ఒక పోస్ట్ను షేర్ చేసారు. ఇటీవల కనిపించిన వీడియోను కూడా బిగ్ బి షేర్ చేసారు. ఆంఖ్ ఖోల్కే దేఖ్ లో, కాన్ లగాకే సన్ లో, మారీు ముంబై కి హెూగీ జై జైకార్, యే బాత్ అబ్ మాన్లో! అని అమితాబ్ మ్యాచ్ సమయంలో కొడుకు అభిషేక్ బచ్చన్తో కొన్ని మరపురాని క్షణాలను కలిగి ఉన్న వీడియోను షేర్ చేసారు. ఈ ఏడాది ప్రారంభంలో అమితాబ్ బచ్చన్ తన మణికట్టుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. 2024 జనవరిలో తన బ్లాగ్లో అమితాబ్ ఇలా రాసారు. ఐఎస్పిఎల్ ను ప్రకటనలతో ప్రమోట్ చేసాం. ఫలవంతమైన మార్గంలో ఉంది. ఇందులో పాల్గొన్న యజమానులు సభ్యులందరూ చిరస్థాయిగా కలిసి ఉండాల్సిన అవసరం ఉందిఅని రాసారు. అయితే అమితాబ్ చేతికి సర్జరీ అయినా కానీ తన తదుపరి ప్రాజెక్టుల షూటింగుల్లో పాల్గొన్నారు. ఇటీవలి అమితాబ్ కూడా కోవిడ్ –19 తో పోరాడాడు. ప్రాజెక్ట్ కే (కల్కి) ప్రమోషన్స్ కోసం 2023 కామిక్ కాన్ కోసం శాన్ డియాగోకు ప్రయాణించకుండా అనారోగ్య సమస్యలున్నాయని అప్పట్లో వెల్లడించాడు. అమితాబ్ కల్కి 2989 చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సౌత్ – నార్త్ లో పలువురు అగ్ర కథానాయకుల సినిమాల్లో అమితాబ్ నటిస్తున్నారు.



# బుస్ బుస్ స్నేక్ బాబోయ్!

సిల్క్ ప్యాంట్ ధరించిన పీసీ దానికి కాంబినేషన్ గా స్టైలిష్ వైట్ క్రాప్ టాప్ ధరించి అందాల ఆరబోతతో బోల్డ్ గా కనిపించింది. అమెరికా కోడలు ప్రియాంక చోప్రా ముంబైలో అడుగుపెట్టింది. చాలా కాలానికి పుట్టింటికి తిరిగి వచ్చింది. ఇంతకీ దేనికోసం ఇలా వచ్చింది? అంటే.. ఒక లగ్జరీ బ్రాండ్ ఈవెంట్ కోసం ముంబైలో అడుగుపెట్టిన పీసీ.. ఇక్కడ అడుగుపెడుతూనే మైండ్ బ్లాక్ చేసింది. స్టిల్ ఫోటోగ్రాఫర్లు తన వెంట పడి మరీ ఫోటోషూట్లు చేసారు. తాజాగా రిలీజైన ఫోటోల్లో పీసీ రూపం కుర్రకారు గుండెల్లో గుబులు పెంచింది. సిల్క్ ప్యాంట్ ధరించిన పీసీ దానికి కాంబినేషన్ గా స్టైలిష్ వైట్ క్రాప్ టాప్ ధరించి అందాల ఆరబోతతో బోల్డ్ గా కనిపించింది. పోనీటైల్ హెయిర్ కట్, హైహీల్స్ లో స్పెషల్ గా కనిపించింది. దాదాపు ఏడాది తర్వాత భారతదేశాన్ని సందర్శించిన ప్రియాంక చోప్రా ప్రత్యేక కార్యక్రమంలో కెమెరాల ముందు నవ్వుతూ కనిపించింది. కెమెరాల వైపు చూస్తూ నమస్తే అంటూ అందరనీ పలకరించింది. తన లేటెస్ట్ విహారయాత్రకు సంబంధించిన ఫోటోలు వీడియోలు ఇన్స్టాలో వైరల్ గా షేర్ అవుతున్నాయి. అభిమానులు వ్యాఖ్యల విభాగంలో ప్రశంసల్లో ముంచేస్తున్నారు. ఇక అందరి కళ్లు పీసీ మెడలో ఉన్న ఆ గోల్డెన్ స్నేక్ నెక్లెస్ పైనే నిలిచాయి. ఒక పామును మెడలో వేసి చుట్టేసినట్టుగా ఎంత అందంగా డిజైన్ చేసారు? రియల్లీ స్టన్నింగ్ అంటూ ఫ్యాన్స్ ప్రశంసిస్తున్నారు. పీసీ మెడలో నెక్లెస్ చూసి పాము అనుకున్నాను అని ఒకరు వ్యాఖ్యానించగా, ఆ నెక్లెస్.. బుస్ బుస్ స్నేక్ బాబోయ్! అంటూ మరొకరు కొంటెగా కామెంట్ చేసారు. బల్గారీ స్టోర్ గ్రాండ్ లాంచ్ కోసం ప్రియాంక చోప్రా ముంబైలో అడుగుపెట్టడానికి కారణం.. ఈ కార్పొరెట్ కు ప్రపంచ బ్రాండ్ అంబాసిడర్లలో పీసీ కూడా ఒకరిగా ఉన్నారు.. ఇతర అంబాసిడర్లలో అన్నే హాత్వే, జెండయా, లిసా వంటి స్టార్లు ఉన్నారు. ప్రియాంక తన ఇన్స్టాలో తాను భారతదేశానికి ప్రయాణమవుతున్నానని ప్రకటించింది. తన కుమార్తె మాల్తీతో కలిసి ఉన్న సెల్ఫీని పీసీ షేర్ చేసింది.ముంబయి మేరీ జాన్.. ఇదిగో! అని వ్యాఖ్యానించింది. ఆ ఫోటోలు వైరల్ అయ్యాయి. కొన్ని గంటల తర్వాత తల్లీ కూతుళ్లిద్దరూ ముంబై విమానాశ్రయంలో కనిపించారు. కొద్దిసేపటికే వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఆ తర్వాత ప్రియాంక బీచ్ లో టోపీ ధరించి నలుపు రంగు దుస్తుల్లో కనిపించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. అక్కడ మాల్తీ ఆకుపచ్చ టాప్ ప్యాంటు కాంబోలో కనిపించింది. ప్రియాంక తన కూతురిని ఈసారి కెమెరాల ముందు దాచలేదు. తన కారులోకి వెళ్ళే ముందు ఫోటోగ్రాఫర్స్ అందరినీ ఆప్యాయంగా పలకరించింది. మాల్టీ భారత్లో పర్యటించడం ఇది రెండోసారి. గత ఏడాది ఏప్రిల్లో నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ లాంచ్ కోసం నిక్ – ప్రియాంక తమ చిన్నారి మాల్తీని వెంట తీసుకొచ్చారు.

# మనసంతా ప్రియురాలే!



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు ఆనంద్ దేవరకొండ. టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు ఆనంద్ దేవరకొండ. అతి తక్కువ సినిమాలతోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ.. తనదైన శైలిలో అలరిస్తున్నారు. తన రూటే సెపరేట్ అన్నట్లు వరుస సినిమాలు చేస్తున్నారు. రీసెంట్ గా బేబీ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్నారు. సాయి రాజేష్ డైరెక్షన్లో తెరకెక్కిన కల్ట్ లవ్ స్టోరీ బేబీ.. గతేడాది రిలీజై బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులు సృష్టించింది. తక్కువ బడ్జెట్ తో రూపొంది.. భారీ లాభాలు సంపాదించింది. రెండు నెలల పాటు థియేటర్లలో రన్ అయిన ఈ మూవీతో ఆనంద్ దేవరకొండ కెరీర్ మలుపు తిరిగింది. ఇప్పుడు ఆయన మరో లవ్ స్టోరీ డ్యూయెట్ తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. యూత్ ఫుల్ లవ్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాతో మిథున్ వరదరాజ కృష్ణన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. హాయ్ నాన్న ఫేమ్ రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా డ్యూయెట్ నుంచి క్రేజీ అప్డేట్ వచ్చింది. ఆనంద్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ను రిలీజ్ చేశారు. యంగ్ హీరోకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనంద్ పోషిస్తున్న మదన్ క్యారెక్టర్ లుక్ ను రివీల్ చేశారు. మనసంతా ప్రియురాలను నింపుకున్న యువకుడిగా ఆనంద్ దేవరకొండ ఈ లుక్ లో కనిపిస్తున్నారు. పోస్టర్ అంతా ఆనంద్ ఉండగా.. మధ్యలో హీరోయిన్ కారిడార్ వద్ద నవ్వుతూ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ పోస్టర్ కు సోషల్ మీడియాలో మంచి రివ్యూలు వస్తున్నాయి. చాలా రిఫ్రెషింగ్ గా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. త్వరలో ఈ సినిమా ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేస్తామని కూడా మేకర్స్ అనౌన్స్ చేశారు. ప్రస్తుతం డ్యూయెట్ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాదే విడుదల కానుంది. స్టూడియో గ్రీన్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. సహ నిర్మాతగా మధుర శ్రీధర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. జీవీ ప్రకాశ్ సంగీతాన్ని అందిస్తున్నారు. డిఫరెంట్ ప్రేమ కథగా రూపొందుతున్న ఈ డ్యూయెట్ సినిమాతో ఆనంద్ దేవరకొండ ఎలా అలరిస్తారో చూడాలి మరి.

# ఆ హిట్ సీక్వెల్‌కి చాలా టైం పట్టేనా..?

ఈ ఏడాదిలో ఖైదీ సీక్వెల్ ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని అంతా అనుకున్నారు. తమిళ స్టార్ హీరో కార్తీ, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ 2019లో వచ్చిన ఖైదీ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. అప్పటి నుంచి ప్రేక్షకులు ఖైదీ సీక్వెల్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఖైదీ తర్వాత లోకేష్ కనగరాజ్ గ్రాఫ్ అమాంతం పెరిగింది. దాంతో ఖైదీ సీక్వెల్ కి మరింత క్రేజ్ పెరిగింది. ఈ ఏడాదిలో ఖైదీ సీక్వెల్ ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని అంతా అనుకున్నారు. కానీ ఇప్పటి వరకు అందుకు సంబంధించిన ఎలాంటి హడావుడి లేదు. తాజాగా లోకేష్ కనగరాజ్ పుట్టిన రోజు జరిగింది. ఆ సమయంలో ఖైదీ సీక్వెల్ పై ప్రకటన ఉంటుందని అంతా భావించారు. కానీ నిరాశే మిగిలింది. ఖైదీ నిర్మాణ సంస్థ నుంచి లోకేష్ కనగరాజ్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ ఒక పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. కానీ అందులో ఖైదీ 2 విషయమై ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. దాంతో ఫ్యాన్స్ నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిలో అసలు ఖైదీ 2 ఉంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం దర్శకుడు లోకేష్ కనగరాజ్ తలైవర్ 171వ సినిమాని



రూపొందించే పనిలో ఉన్నాడు. బాలీవుడ్ స్టార్స్ రణవీర్ సింగ్ కీలక పాత్రలో నటిస్తున్న తలైవర్ 171 తర్వాత ఖైదీ 2 సినిమాను పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు విక్రమ్ మరియు లియో సీక్వెల్ లు కూడా ఉంటాయని సమాచారం అందుతోంది. విక్రమ్ తర్వాత లియో తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన లోకేష్ కనగరాజ్ ఆ స్థాయిలో మెప్పించడం లో విఫలం అయ్యాడు. లోకేష్ కనగరాజ్ మార్క్ మిస్ అయ్యింది .



# నిన్న డాన్స్ నేడు ఫైట్..!

విజయ్ బిన్నీ కొరియోగ్రఫీ అందించిన పాట చిత్రీకరణ నిన్నటితో పూర్తి అయ్యింది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా బింబిసార దర్శకుడు వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వంభర సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉంది. అయితే షూటింగ్ మాత్రం బ్రేక్ లేకుండా స్పీడ్ గా సాగుతోంది. నిన్నటి వరకు ఫ్యామిలీ ఫంక్షన్ సాంగ్ చిత్రీకరణ జరిపారు. విజయ్ బిన్నీ కొరియోగ్రఫీ అందించిన పాట చిత్రీకరణ నిన్నటి తో పూర్తి అయ్యింది. ఆ షెడ్యూల్ పూర్తి చేసి కనీసం ఒక్క రోజు కూడా గ్యాప్ తీసుకోకుండా చిత్ర యూనిట్ సభ్యులు నేటి నుంచి యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారట. భారీ యాక్షన్ సన్నివేశాల కోసం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. పాట చిత్రీకరణకు ముందు ఒక యాక్షన్ సన్నివేశాన్ని చిరంజీవి పై చిత్రీకరించిన విషయం తెల్సిందే. ఇప్పుడు మరో యాక్షన్ సన్నివేశం చిత్రీకరణ కోసం దర్శకుడు సిద్ధం అవుతున్నాడు. చూస్తుంటే ఈ సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాలు పుష్కలంగా ఉన్నాయని, చిరంజీవి మార్క్ యాక్షన్ చూడబోతున్నామని ఫ్యాన్స్ అంటున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి కి ఐదుగురు చెల్లెలు ఉంటారట. విభిన్నమైన సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ సినిమా ను దర్శకుడు వశిష్ఠ రూపొందిస్తున్నాడు.

# ఫ్యాన్స్‌కు నచ్చట్లే బుచ్చిబాబు!



కానీ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా ఆలస్యం కావడంతో బుచ్చిబాబు కూడా రామ్ చరణ్ కోసం చాలా రోజులపాటు ఎదురు చూడాల్సి వచ్చింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ తన 16వ సినిమాను బుచ్చిబాబు దర్శకత్వంలో స్టార్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఎప్పటినుంచో వెయిటింగ్ లిస్టులో ఉన్న ఈ ప్రాజెక్టు మొత్తానికి సెట్స్ పైకి రాబోతోంది. అసలైతే గత ఏడాదిలోనే ఈ సినిమా ప్రాజెక్టు మొదలు కావాల్సింది. కానీ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా ఆలస్యం కావడంతో బుచ్చిబాబు కూడా రామ్ చరణ్ కోసం చాలా రోజులపాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇక మొత్తానికి సరైన ప్లాన్ సెట్ కావడంతో ఈ ప్రాజెక్టును మార్చి 20వ తేదీన మొదలుపెట్టబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు చాలా వరకు పూర్తి చేసుకున్న దర్శకుడు ఇప్పుడు రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేసి రెండు కీలకమైన ఎపిసోడ్స్ ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఒక సీరియస్ డ్రామా సీన్ తోనే షూటింగ్ మొదలు కాబోతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమాకు టైటిల్ కూడా ఇప్పటికే ఫిక్స్ చేసినట్లుగా తెలుస్తోంది. అయితే రామ్ చరణ్ మాత్రం ఇంకా ఆ టైటిల్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దర్శకుడు బుచ్చిబాబు కథకు తగ్గట్టుగా 'పెద్ది' అనే టైటిల్ అనుకున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఇదే టైటిల్ తో గతంలో ఎన్టీఆర్ తో కూడా ఒక సినిమా రాబోతుంది అని చాలా రకాల గాసిప్స్ అయితే వచ్చాయి. అది కూడా బుచ్చిబాబు డైరెక్ట్ చేసే అవకాశం ఉందని కూడా ఇండస్ట్రీలో టాక్ అయితే వినిపించింది. నిజానికి బుచ్చిబాబు మొదట ఎన్టీఆర్ తోనే సినిమా చేయాలని అనుకున్నాడు. కానీ అతను రిజెక్ట్ చేయడంతోనే ఆ కథ రామ్ చరణ్ వద్దకు వెళ్ళింది అని కొన్ని మార్పులతో దర్శకుడు సరికొత్తగా సినిమా షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నట్లుగా మరొక రకమైన టాక్ అయితే వినిపిస్తోంది. ఇక ఇది ఎంతవరకు నిజమో కానీ మొత్తానికి ఈ టైటిల్ విషయంలో అయితే ఫాన్స్ నుంచి అంతగా పాజిటివ్ రియాక్షన్స్ అయితే రావడం లేదు. పెద్ది అనే టైటిల్ చాలా ఓల్డ్ గా ఉంది అని ఈ టైటిల్ అంతగా కిక్ ఇవ్వడం లేదు అనే విధంగా సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు.



# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు.....!




**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మార్కెట్లకు దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 532 పాయింట్ల పుంజుకొని 72,633 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 160 పాయింట్లు పెరిగి 21,999 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.06 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో నెస్లే ఇండియా, మారుతీ షేర్లు మాత్రమే నష్టాల్లో ట్రేడవుతున్నాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంకు తన ప్రామాణిక వడ్డీ రేట్లను మార్చలేదు. 23 ఏళ్ల గరిష్ఠ స్థాయి అయిన 5.25-5.50 శాతంగానే కొనసాగించింది. వరుసగా అయిదో సమావేశంలోనూ వడ్డీరేట్లలో మార్పు చేయనట్లయ్యింది. ద్రవ్యోల్బణం ఫెడ్ లక్ష్యమైన 2 శాతానికి ఎగువనే నమోదవుతూ వస్తుండడం ఇందుకు నేపథ్యం. ఫిబ్రవరి ద్రవ్యోల్బణం అంచనాల కంటే అధికంగా 3.2 శాతంగా నమోదైంది. అమెరికా మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. నేడు ఆసియా- పసిఫిక్ ప్రధాన సూచీలు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. జపాన్ నిక్కీ సూచీ ఆరంభంలో ఆల్‌టైం గరిష్ఠానికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 86.48 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. 'విదేశీ సంస్థాగత మదుపర్లు' బుధవారం నికరంగా రూ.2,599.19 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. 'దేశీయ సంస్థాగత మదుపర్లు' రూ.2,667.52 కోట్ల స్టాక్స్‌ను కొనుగోలు చేశారు.

# భారత్‌కు 8 శాతం వృద్ధి అవసరం...!



**న్యూఢిల్లీ :** భారత్‌లో పేదరికం నిర్మూలన, సరిపడ ఉద్యోగాలను కల్పించాలంటే ప్రతీ ఏడాది 8 శాతం వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) భారత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రిష్ణమూర్తి వెంకట సుబ్రమణియన్ అన్నారు. అసమానతలను తగ్గించడానికి స్థిరమైన వృద్ధి అవసరమన్నారు. ఒఎంఐ ఫౌండేషన్ రూపొందించిన 'ఆర్థిక వ్యవస్థలో సామాజిక రక్షణఅన్ ప్యాకింగ్ సప్లై డైనమిక్స్' రిపోర్ట్‌ను సుబ్రమణియన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వ్యవస్థను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "మనం 7 శాతం వృద్ధిని నమోదు చేసినప్పటికీ అసహనంగానే భావిస్తున్నాం. దేశం చాలా మౌలిక సదుపాయాలను సృష్టించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం 8 శాతం అంతకంటే ఎక్కువ వృద్ధి చెందాలి." అని ఒఎంఐ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో సుబ్రమణియన్ అన్నారు. ఎనిమిది శాతం వృద్ధి ద్వారా చాలా ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం ఉంటుందని.. తద్వారా పేదరికం, అసమానతలను తగ్గించవచ్చన్నారు. గడిచిన ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి రేటును ఆయన గుర్తు చేశారు. "ఆర్థిక లోటును 3 శాతానికి తగ్గించడం, జిడిపిలో అప్పుల నిష్పత్తిని 66 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని భారత్ పాశ్చాత్యా దేశాల నమూనాను కాపీ చేసింది. అయితే ఇది భారత పరిస్థితులకు సరిపోకపోవచ్చు. అమెరికా, యూరప్ తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది. అయితే ఆయా దేశాలతో పోల్చితే భారత ఆర్థిక వ్యవస్థ చాలా భిన్నమైంది. ఆయా దేశాలు దాదాపుగా మౌలిక వసతుల అభివృద్ధిని పూర్తి చేశాయి. అసమానతలను తగ్గించాయి.'' అని సుబ్రమణియన్ పేర్కొన్నారు.ఒఎంఐ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐశ్వర్య రామన్ మాట్లాడుతూ.. వివిధ వేదికల్లో పని చేస్తున్న కార్మికులకు సమగ్రమైన, అర్థవంతమైన సామాజిక రక్షణలను అందించడానికి పరస్పర సహకారాలు అవసరం అన్నారు. డిజిటల్ సాంకేతికత, వినూత్న సామాజిక భద్రతా పరిష్కారాలను ఉపయోగించుకోవడం ద్వారా భారత్ స్థిరమైన, సమ్మిళిత కార్మికుల ప్రయోజనాలకు మార్గం సుగమం చేస్తుందన్నారు. ఏకకాలంలో కార్మికుల సంక్షేమాన్ని మెరుగుపరిచే, వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణానికి మద్దతు ఇచ్చే సామాజిక రక్షణ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం చాలా అవసరమన్నారు.


# రూ.2.8 కోట్ల విరాళాలు నిలిపేసిన బైడెన్ పార్టీ



అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చెందిన డెమోక్రటిక్ పార్టీ ఇండో అమెరికన్ వ్యాపారవేత్త ఇచ్చిన మొత్తం సుమారు 3.4 లక్షల డాలర్ల(రూ.2.8 కోట్లు) విరాళాలను నిలిపేసినట్లు మీడియా కథనాల ద్వారా తెలిసింది. పొలిటికో కథనం ప్రకారం.. బిడెన్ విక్టరీ ఫండ్(బీవీఎఫ్) కోసం తాజాగా ఇండో అమెరికన్ వ్యాపారవేత్త గౌరవ్ శ్రీవాస్తవ 50,000 డాలర్లు(రూ.41 లక్షలు) విరాళాన్ని అందించాలని నిర్ణయించుకున్నారు. అయితే అమెరికా చట్టాల ప్రకారం అది సాధ్యంకాదని, ఆ విరాళాన్ని నిలిపివేస్తున్నట్లు జో బైడెన్ ప్రచార అధికారి తెలిపారు. గతంలోనూ డెమోక్రాటిక్ కాంగ్రెషనల్ ప్రచార కమిటీ (డీసీసీసీ)కు తాను ఇచ్చిన 2.9లక్షల డాలర్లను హెూల్డ్‌లో పెడుతున్నట్లు చెప్పారు. లాస్ ఏంజిల్స్‌కు చెందిన శ్రీవాస్తవ తన భార్య గౌరవ్ షారన్ పేరుతో, శ్రీవాస్తవ ఫ్యామిలీ ఫౌండేషన్ పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు. తనకు ఇతర కంపెనీలు ఉ?న్నాయి. అయితే ఆ సంస్థలు నిత్యం చట్టపరమైన వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. అవి ఎలాంటి వివాదాలో మాత్రం తెలియరాలేదు. 2022లో బాలిలో జరిగిన ప్రపంచ ఆహార భద్రతా ఫోరమ్‌కు తన ఫ్యామిలీ 1 మిలియన్ డాలర్లు విరాళం ప్రకటించింది. అనంతరం అతడి సంస్థల్లో వివాదాలు నెలకొన్నాయి. ఆ అంశాలు కోర్టు వరకు వెళ్లడంతో థింక్ ట్యాంక్ అట్లాంటిక్ కౌన్సిల్ అతనితో సంబంధాలు తెంచుకుంది. అమెరికా ఎన్నికల చట్టాల ప్రకారం..ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి ఒక వ్యక్తి 3,300 డాలర్లకు మించి విరాళం ఇవ్వకూడదనే నిబంధన ఉంది. అయితే నిర్దిష్ట అవసరాలను తీర్చే ప్రచార కమిటీలకు మాత్రం విరాళాలు ఇవ్వడానికి అనుమతులున్నాయి. దాంతో డీసీసీసీకు శ్రీవాస్తవ భారీగా విరాళం ఇచ్చారు. ఆ విరాళాలను బీవీఎఫ్ బైడెన్ ప్రచారానికి, డెమోక్రటిక్ నేషనల్ కమిటీకి, స్టేట్ పార్టీ యూనిట్లకు విభజించింది. ప్రస్తుతం తెరపైకి వస్తున్న వివాదాలతో ఆ విరాళాలను స్వచ్ఛంద సంస్థలకు బదిలీచేస్తున్నట్లు డెమోక్రాట్‌ల ప్రతినిధి చెప్పారు.

# AI జనరేటెడ్ వీడియోలు గుర్తించడం ఇకపై సులువు.....!


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ఎక్కడ చూసినా దీనిదే హవా. ప్రతీ రంగంలోనూ ఏఐ తన ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. దీని సాయంతోనే కంటెంట్ క్రియేటర్లు వీడియోలు రూపొందిస్తున్నారు.తమ ఫాలోవర్లను ఆకట్టుకోవడంలో భాగంగా లేనిది ఉన్నట్టుగా.. ఉన్నది లేనట్టుగా చూపిస్తున్నారు. దీంతో ఏది నిజమైన వీడియోనో.. ఏది ఏఐ సాయంతో రూపొందించిన వీడియోనో తెలుసుకోలేక తికమకపడుతున్నారు. దీనికి చెక్‌పెట్టేందుకు వీడియో స్ట్రీమింగ్ వేదిక యూట్యూబ్ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. తన ప్లాట్‌ఫామ్‌లో కొత్త రూల్స్ తీసుకొచ్చినట్లు యూట్యూబ్ బ్లాగ్ పోస్ట్ ద్వారా వెల్లడించింది. "యూజర్లకు వాస్తవిక కంటెంట్‌కు, ఏఐతో రూపొందించిన వీడియో మధ్య వ్యత్యాసాన్ని తెలపాల్సిన అవసరం ఉంది. దాని కోసమే క్రియేటర్ స్టూడియోలో కొత్త టూల్‌ని పరిచయం చేస్తున్నాం. వ్యక్తులు, స్థలాలు, దృశ్యాలను




ఏఐ ద్వారా క్రియేట్ చేస్తే ఆ విషయాన్ని ఛానెల్ నిర్వహిస్తున్న వ్యక్తులు తెలపాల్సి ఉంటుంది. అదే స్పెషల్ ఎఫెక్ట్‌లు ఉపయోగించి ఎడిట్ చేసిన కంటెంట్‌కు ఏఐ ప్రత్యేక లేబుల్ పెట్టాల్సిన అవసరం లేదు" అని యూట్యూబ్ తన బ్లాగ్‌లో రాసుకొచ్చింది.


# దేశంలో విరివిగా పెరిగిన చేపల వినియోగం..

## తాజా అధ్యయనంలో వెల్లడి



కాలం మారుతున్నా కొద్ది ప్రజల ఆహార, అభిరుచుల్లో కూడా మార్పులు వస్తున్నాయి. గత పదిహేనేళ్ల కాలంలో దేశంలో చేపల వినియోగం 81 శాతం పెరిగింది. 2005లో 4.9 కిలోలుగా ఉన్న వార్షిక తలసరి వినియోగం 2021 నాటికి 8.89 కిలోలకు పెరిగినట్లు తాజాగా జరిగిన అధ్యయనం వెల్లడించింది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ లాంటి ప్రభుత్వ విభాగాలతో కలిసి వరల్డ్ ఫిష్, ది ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఈ అధ్యయనం చేసింది. కాలం మారుతున్నా కొద్ది ప్రజల ఆహార, అభిరుచుల్లో కూడా మార్పులు వస్తున్నాయి. గత పదిహేనేళ్ల కాలంలో దేశంలో చేపల వినియోగం 81 శాతం పెరిగింది. 2005లో 4.9 కిలోలుగా ఉన్న వార్షిక తలసరి వినియోగం 2021 నాటికి 8.89 కిలోలకు పెరిగినట్లు తాజాగా జరిగిన అధ్యయనం వెల్లడించింది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ లాంటి ప్రభుత్వ విభాగాలతో కలిసి వరల్డ్ ఫిష్, ది ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఈ అధ్యయనం చేసింది. 2005-06 నుంచి 2020-21 నడుమ జరిగిన ఈ అధ్యయనంలో.. దేశంలో చేపల ఉత్పత్తి కూడా రెట్టింపై 14.164 మిలియన్ టన్నులకు చేరినట్లు తేలింది. దేశీయ వినియోగం 2005-2006లో 82.36 శాతం ఉండగా, 2019-2020 నాటికి 83.65 శాతానికి చేరింది. మిగతా మొత్తం ఆహారేతర అవసరాలకు, ఎగుమతులకు ఉపయోగించినట్లు వెల్లడైంది. ఇదిలావుంటే.. స్థానిక వినియోగానికి చేపలు, చేపల ఉత్పత్తుల దిగుమతి కూడా గణనీయంగా పెరిగినట్లు ఈ అధ్యయనం పేర్కొంది. స్థానికంగా లభించే, దిగుమతి చేసుకున్న చేపలను పరిగణనలోకి తీసుకుంటే.. దేశీయ మార్కెట్లో వినియోగించే చేపల మొత్తం పరిమాణం 120 శాతం పెరిగి 5.428 మిలియన్ టన్నుల నుంచి 11.924 మిలియన్ టన్నులకు పెరిగింది. తాజా అధ్యయనం ప్రకారం.. త్రిపురలో అత్యధికంగా చేపల వినియోగదారులు 99.35% ఉన్నారు. ఇక హర్యానాలో అత్యల్పంగా 20.55% మంది మాత్రమే చేపలను ఆహారంగా తీసుకుంటున్నారు. తూర్పు, ఈశాన్య రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కేరళ, గోవాలలో చేపలు తినే జనాభా 90 శాతానికి పైగా ఉంది. ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లలో ఈ గణాంకాలు 30 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. కేరళ (53.5%), గోవా (36.2%) రాష్ట్రాల్లో రోజూ చేపలే తినేవారు ఎక్కువగా ఉన్నారు. వారానికి ఒకరోజు చేపలు తినేవారు అస్సాం, త్రిపుర రాష్ట్రాల్లో అధికంగా 69 శాతం చొప్పున ఉన్నారు.

# పొదుపుపై యువతలో పెరుగుతున్న ఆసక్తి.. చైనాలో బంగారంపై బంగారంలాంటి పెట్టుబడి మార్గం



చైనీస్ యువకులు ఆర్థిక అస్థిరత మధ్య సురక్షితమైన పెట్టుబడి ఎంపికగా యూనిట్‌కు 400 నుంచి 600 ఆర్‌ఎంబీ మధ్య ధర కలిగిన ఒక గ్రాము బరువున్న "గోల్డ్ బీన్స్" చిన్న బంగారు ఉత్పత్తులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

ఈ ట్రెండ్ ముఖ్యంగా చైనా జనరేషన్ జెడ్‌లో జనాదరణ పొందింది. ప్రతి నెలా బంగారు గింజలను కొనుగోలు చేసే కొత్త ట్రెండ్‌కు దారితీసింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ప్రత్యేకించి విబో యువ చైనీస్లో బంగారంపై ఇష్టాన్ని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. ధనం మూలం ఇదం జగత్ అంటే డబ్బు ఉన్న వారికే సమాజంలో విలువ ఉంటుందని అర్థం. అయితే ఇటీవల పెరుగుతున్న ఖర్చులు వయస్సుతో సంబంధం లేకుండా పొదుపుపై ఆసక్తి చూపుతన్నారు.

చైనీస్ యువకులు ఆర్థిక అస్థిరత మధ్య సురక్షితమైన పెట్టుబడి ఎంపికగా యూనిట్‌కు 400 నుంచి 600 ఆర్‌ఎంబీ మధ్య ధర కలిగిన ఒక గ్రాము బరువున్న "గోల్డ్ బీన్స్" చిన్న బంగారు ఉత్పత్తులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ ట్రెండ్ ముఖ్యంగా చైనా జనరేషన్ జెడ్‌లో జనాదరణ పొందింది. ప్రతి నెలా బంగారు గింజలను కొనుగోలు చేసే కొత్త ట్రెండ్‌కు దారితీసింది.

# ట్యాక్స్ పేయర్స్‌కు అలెర్ట్.. ఆ ఐదు తప్పులు చేశారో..?

భారతదేశంలో పన్ను చెల్లింపులు తరచుగా ఆర్థిక భారంగా పరిగణిస్తారు. అయితే పన్ను ప్రణాళికకు సంబంధించి చెల్లింపుదారులకు అవగాహన లేకపోవడమే మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. ఆర్థిక ప్రణాళికల్లో పన్ను పొదుపు వ్యూహాలను పొందుపరిచేటప్పుడు ఈ ప్రక్రియను మరింత కష్టతరంగా ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున మీ పన్ను ప్రణాళికను రూపొందించడానికి ఇది చాలా మంచి సమయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మార్చి 31 గడువులోపు పన్ను ఆదా పెట్టుబడులకు సంబంధించి బాగా సమాచారంతో నిర్ణయాలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులు చేసే కొన్ని తప్పులు ఆర్థిక భారాన్ని కలుగజేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. పన్ను ఆదా చేసే ఇన్వెస్ట్‌మెంట్‌లు చేసేటప్పుడు నివారించాల్సిన తప్పులను ఓ సారి తెలుసుకుందాం. తక్కువ పెట్టుబడి పాత పన్ను విధానంలో సెక్షన్ 80 సీ కింద కనీసం రూ. 1.5 లక్షల తగ్గింపును, సెక్షన్ 80సీసీడీ(1బి) కింద ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్‌లకు అదనంగా రూ. 50,000 తగ్గింపును పొందవచ్చు.



# ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అరెస్ట్ అన్యాయం.. ఇదొక 'బ్లాక్ డే': కూనంనేని



హైదరాబాద్ : ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అరెస్ట్ చేయడం అన్యాయమని, ఇదొక 'బ్లాక్ డే'గా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అభివర్ణించారు. లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన ఏపి సిఎం జగన్ రెడ్డిని బైట వదిలేసి, రూ.వంద కోట్ల వ్యవహారంలో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు చేయడం ద్వారా ప్రధాని మోడీ తన ప్రత్యర్థుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతోందన్నారు. బిజెపి అనుకున్నట్లుగా సీట్లు వస్తే ఏ రాష్ట్రంలో ఏ వ్యక్తిని కూడా బతనివ్వబోరని, చివరకు సిఎం రేవంత్ రెడ్డికి కూడా ప్రమాదం తీసుకువస్తారన్నారు. ఒక హిట్లర్, ఒక ముస్సోలిని , ఫాసిజం, నాజీయిజం అన్ని కలబోసిన వ్యక్తి మోడీ అని, అధికారం కోసం ఏమైనా చేసే ఔరంగజేబ్ ఆయనలో దాగి ఉన్నడన్నారు. భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చి, శాశ్వత అధ్యక్షునిగా మారాలని మోడీ భావిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి కుర్చీలో కూర్చునేందుకు ఏ నిమిషం, ఏదైనా చేసేందుకు నరేంద్ర మోడీ సిద్ధంగా ఉంటారని విమర్శించారు. ప్రమాదకరమైన ప్రధాని నరేంద్ర మోడీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలలో చైతన్యం రావాలన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు హైదరాబాద్ రెండు రోజుల పాటు జరిగాయి. సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, కళవేణశంకర్, బాలనర్సింహా, ఇ.టి.నర్సింహాతో కలిసి కూనంనేని సాంబశివరావు హైదరాబాద్ మగ్ధూంభవన్ శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశ వివరాలను వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలు, కాంగ్రెస్ ఎన్నికల అవగాహన అంశంపైన సమావేశంలో చర్చించామని, కాంగ్రెస్ సీట్లు సర్దుబాటుపై స్పష్టత వచ్చిన తర్వాత మరోసారి చర్చించి, తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. బాండ్స్ ద్వారా సేకరించిన అక్రమ డబ్బుతో ప్రతిపక్షాలను, 'ఇండియా కూట మి'ని ధ్వంసం చేసి, 400 స్థానాల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని, మరోవైపు మేథావులు, సాఫ్ట్‌వేర్ నిపుణులతో ఇవిఎం యంత్రాలను ట్యాపింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మోడీ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఏ ఒక్క బిజెపి నేతను కూడా అరెస్ట్ చేయలేదన్నారు. సిసోడియాను అరెస్ట్ చేసినప్పుడే కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదని, వారి మధ్య అవగాహన ఉన్నందునే అప్పుడు అరెస్ట్ చేయ లేదని విమర్శించారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఇద్దరు సిఎంలను ఇప్పటికే అరెస్ట్ చేశారన్నారు. బిర్లా, సహారా కంపెనీలపై ఐటి దాడులు నిర్వహిస్తే, 2013లో అప్పటి గుజరాత్ సిఎం నరేంద్ర మోడీకి బిర్లా కంపెనీ రూ. 24 కోట్లు, సహారా కంపెనీ రూ.40 కోట్లు చెల్లించినట్టుగా ఆధారాలు లభించాయని, దీనిపైన ఇడి ఎందుకు విచారణ చేపట్టలేదని కూనంనేని ప్రశ్నించారు.

ఈ కేసులో మోడీపై ఇడి కేసు నమోదు చేయకుండా వదిలిపెట్టిందని విమర్శించారు. ప్రమాద కరమైన బిజెపిని ఎదుర్కొనే క్రమంలో కాంగ్రెస్ పార్టీ సిపిఐ, సిపిఐ(ఎం) కలుపుకుపోవాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. కమ్యూనిస్టు పార్టీలను కూడా కాంగ్రెస్ కలుపుకుని పోతే మంచిదన్నారు. దక్షిణాదిలోకి బిజెపి రాకుండా జాగ్రత్త వ్యవహరించాలన్నారు. బిజెపిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సమర్ధవంతమైన పాత్రను పోషించడంలేదని విమర్శించారు. తెలంగాణలో సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలకు లోక్ సభ ఎన్నికల్లో ఒక్క సీటులో కూడా సర్దుబాటు జరగలేదని, తమిళనాడు రాష్ట్రాన్ని చూసైనా నేర్చుకోవాలని ఆయన కాంగ్రెస్ కు సూచించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ సిఎఎ తర్వాత ఎంపిఆర్ కూడా అమలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని దుయ్యబట్టారు.

# మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణలకు వ్యతిరేకంగా మార్చి 23న నిరసన




హైదరాబాద్ : రాష్ట్ర వామపక్ష పార్టీల సమావేశం మార్చి 22న సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్దన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను సమావేశం తీవ్రంగా ఖండించింది. దీన్ని వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాదులోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన కార్యక్రమం వుంటుంది. పార్లమెం ట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలపై కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ప్రజాతంత్ర హక్కులను కాల రాస్తున్నది. స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలైన ఇడి, ఐటి, సిబిఐలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటున్నది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా, బిజెపియేతర రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనిలో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు, బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితలను అరెస్టు చేసింది. మరో వైపు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అక్కౌంట్లను సీజ్ చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తున్నది. ఈ నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని, శని వారం జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఎస్ వీరయ్య, డిజి నరసింహారావు, సిపిఐ రాష్ట్ర నాయకులు బాల మల్లేష్, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు రమ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గోవర్దన్, ఎంసిపిఐ (యు) నాయకులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ (యు) నాయకులు తేజ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కోటేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

# నాగర్ కర్నూలు, మెదక్ ఎంపీ స్థానాలకు వీరే బీఆర్ఎస్ అభ్యర్థులు!



నాగర్ కర్నూలు, మెదక్ పార్లమెంటు స్థానాలకు బిఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. నాగర్ కర్నూలునుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను, మెదక్ నుంచి పి. వెంకట్రామిరెడ్డిని పోటీకి దించుతున్నట్లు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కాగా భువనగిరి, నల్లగొండ, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల స్థానాలకు ఇంకా పార్టీ అభ్యర్థులను ప్రకటించవలసి ఉంది. గతంలో 10 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈమేరకు కరీంనగర్ నుంచి వినోద్ కుమార్, పెద్దపల్లినుంచి కొప్పుల ఈశ్వర్, మహబూబ్ నగర్ నుంచి మన్నె శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ నుంచి గాలి అనిల్ కుమార్, ఖమ్మంనుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత, మల్కాజిగిరినుంచి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, వరంగల్ నుంచి కడియం కావ్య పోటీ చేయనున్నారు.

# అర్వింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం : కర్ణాటక సీఎం సిద్ధరామయ్య




ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికమని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నదని ఆయన విమర్శించారు. కేవలం భయపెట్టి దారికి తెచ్చుకోవడం కోసమే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కేజ్రీవాల్ ఏం చేశాడని ఈడీ అరెస్ట్ చేసిందని సిద్ధరామయ్య ప్రశ్నించారు. కేజ్రీవాల్ అరెస్టుకు కావాల్సిన ఆధారాలే వాళ్ల దగ్గర లేవని, అయినా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. కేంద్ర సర్కారు నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నది అనడానికి ఇదే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.

# ఎన్నికలంటే భయపడుతున్న బీజేపీ: ఢిల్లీ మంత్రి ఆతిశీ




న్యూఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికలంటే భయపడుతున్నదని ఢిల్లీ విద్యాశాఖ మంత్రి ఆతిశీ ఆరోపించారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసును సీబీఐ, ఈడీ గత రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్నప్పటికీ అక్రమాలు జరిగాయడానికి ఒక్క ఆధారం కూడా సేకరించలేకపోయాయని చెప్పారు. ఎన్నికలు సమీపించడంతో కేజ్రీవాల్‌ను నేరుగా ఎదుర్కోలేక దర్యాప్తు సంస్థలతో అరెస్టు చేయించారని విమర్శించారు. మొదటిసారిగా అధికారంలో ఉన్న ఓ ముఖ్యమంత్రిని కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేయించిందన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత ఒక పార్టీ జాతీయ కన్వీనర్‌ను అరెస్టు చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారని చెప్పారు. ఇది బీజేపీ రాజకీయ కుట్ర అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అరవింద్ కేజ్రీవాల్ లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకూడదని బీజేపీ కోరుకుంటున్నదని, అందుకే ఆయనను అరెస్టు చేశారని ఆరోపించారు. ఇది ఒక పార్టీని కిందిస్థాయి నుంచి దెబ్బతీయడం కాకపోతే మరేంటని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము ఇండియా కూటమితో కలిసి పనిచేస్తున్నామని వెల్లడించారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కూటమి నాయకులు సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల కాలంలో ఇద్దరు ముఖ్యమంత్రులను అరెస్టు చేశారని, ఓ పార్టీ బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారని ఆతిశీ అన్నారు. ఈడీని ఆయుధంగా చేసుకుని రాజకీయాలు చేయడం మానేయాలని బీజేపీకి సూచించారు. తమ పోరాటం వీధుల నుంచి న్యాయస్థానం వరకు సాగుతుందని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని సుప్రీంకోర్టు పరిరక్షిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. కేజ్రీవాల్ భద్రతపై ఆమె ఆందోళన వ్యక్తంచేశారు.

# కేజ్రీవాల్ కు తగిన శాస్తి జరిగిందన్న మాజీ రాష్ట్రపతి కుమార్తె



ఆమె ఒక మాజీ రాష్ట్రపతి కుమార్తె. పైగా కాంగ్రెస్ నాయకురాలు. కేజ్రీవాల్ ను ఇడి అధికారులు అరెస్ట్ చేసినందుకు సంతోషించే వారిలో ఆమె ముందువరసలో ఉన్నారు. కేజ్రీవాల్ కు తగిన శాస్తి జరిగిందంటూ ఆమె సంబరపడుతున్నారు. ఇంతకీ ఆమె ఎవరంటే%ౌా% మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ. గతంలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా షీలా దీక్షిత్ పనిచేస్తున్నప్పుడు ఆమెపై కేజ్రీవాల్ నోరు పారేసుకున్నారట. అందుకనే శర్మిష్ఠకు అంత కోపం. 'షీలా దీక్షిత్ పై గతంలో కేజ్రీవాల్ నిరాధారమైన, బాధ్యతారహితమైన ఆరోపణలు చేశారు. ఆ కర్మ ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నారు' అంటూ ఎక్స్ (ట్విటర్)లో ఆగ్రహం వ్యక్తం చేశారు. షీలా దీక్షిత్ కు వ్యతిరేకంగా తన వద్ద బోలెడు సాక్ష్యాలున్నాయని చెప్పిన కేజ్రీవాల్, ఇప్పటివరకూ ఒక్క సాక్ష్యాన్ని కూడా ఇవ్వలేకపోయారని ఆమె ఎద్దేవా చేశారు.

# 'విశాఖ డ్రగ్స్ వెనకాల చంద్రబాబు, పురందేశ్వరి ఉన్నారు'



విశాఖ : విశాఖలో భారీగా పట్టుబడిన డ్రగ్స్ వెనకాల టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన వదిన, ఆంధ్రప్రదేశ్ బిజెపి నేత పురందేశ్వరి, మరికొందరు ఉన్నట్లు తమకు సమాచారం ఉందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇంటర్ పోల్ అందించిన సమాచారంతో విశాఖలోని సిబిఐ, కస్టమ్స్ అధికారులు కలసి ఒక ప్రైవేట్ కంటైనర్ లో బ్రెజిల్ నుంచి వచ్చిన 25వేల కిలోల డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై సజ్జల శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ నిందితులతో తెలుగుదేశం పార్టీ నేతలకు సంబంధాలు ఉన్నట్లు తమకు తెలిసిందన్నారు. దీనినుంచి తప్పించుకునేందుకు తమపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగును చంద్రబాబు పెంచి పోషించారని, తమ ప్రభుత్వ హయాంలో గంజాయి వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నామని సజ్జల చెప్పారు. ఈ వ్యవహారంలో తప్పుడు వార్తలు రాస్తున్న పత్రికలపై చర్య తీసుకోవాలంటూ ప్రెస్ కౌన్సిల్ కు లేఖ రాస్తున్నామన్నారు.

# ఒడిషాలో బిజెడి బిజెపి చర్చలు విఫలం



న్యూఢిల్లీ: ఒడిషాలో బిజెడి , బిజెపిల మధ్య సీట్ల సర్దుబాట్లు కుదరలేదు. తాము లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలన్నింటికి సొంతంగానే పోటీ చేస్తామని అధికారంలో ఉన్న బిజెడి ప్రకటించింది. గత కొద్దిరోజులుగా బిజెపి బిజెడిల మధ్య సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరుగుతూ వచ్చాయి. తమ పార్టీ మొత్తం 147 అసెంబ్లీ స్థానాలకు , 21 లోక్‌సభ సీట్లకు పోటీ చేస్తుందని బిజెడి కార్యనిర్వాహక కార్యదర్శి ప్రణబ్ ప్రకాశ్ దాస్ ప్రకటించారు. ఒడిషాలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు ఒకేసారి మొత్తం నాలుగు విడతలుగా పోలింగ్ ప్రక్రియ ఖరారయింది. తమ పార్టీ ఇంతకు ముందటిలాగానే విజయం సాధిస్తుందని బిజెడి ధీమా వ్యక్తం చేసింది. జగన్నాథ స్వామి ఆశీస్సులు ఇక్కడి ప్రాంతీయ పార్టీకే ఉంటాయని నేత స్పందించారు. కాగా బిజెపి కూడా అన్ని సీట్లకు ఒంటరి పోరుకు సిద్ధం కావల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ముగ్గురు హెచ్‌పి ఎమ్మెల్యేల రాజీనామా



న్యూఢిల్లీ: ఇటీవలి రాజ్యసభ ఎన్నికలలో హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపి అభ్యర్థికి అనుకూలంగా వోటు వేసిన ముగ్గురు స్వతంత్ర ఎంఎల్‌ఎలు తమ రాజీనామా పత్రాలను శుక్రవారం అసెంబ్లీ కార్యదర్శికి అందజేశారు. వారు ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ సుఖ్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. తాము బిజెపిలో చేరతామని, పార్టీ టిక్కెట్‌పై పోటీ చేస్తామని వారిలో ఒకరు విలేకరులతో చెప్పారు. ముగ్గురు ఎంఎల్‌ఎలు ఆశిష్ శర్మ (హమీర్‌పూర్), హోషియార్ సింగ్ (డెహ్రా), కెఎల్ ఠాకూర్ (నాలాగఢ్) శుక్రవారం సిమ్లా చేరుకున్నారు. ప్రతిపక్ష నాయకుడు జైరామ్ ఠాకూర్, ఇతర బిజెపి ఎంఎల్‌ఎలు వెంట రాగావారు తమ రాజీనామా పత్రాలను అసెంబ్లీ కార్యదర్శి యశ్ పాల్ శర్మకు అందజేశారు. 'మేము రాజీనామాలు సమర్పించాం. బిజెపిలో చేరిఆ పార్టీ టిక్కెట్‌పై పోటీ చేస్తాం' అని హోషియార్ సింగ్ విలేకరులతో చెప్పారు. ఆ ముగ్గురు 2022 అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి టిక్కెట్లు కోరారు. కాని టిక్కెట్లు రాకపోవడంతో ఇండిపెండెంట్లుగా పోటీ చేశారు. అయితే, కాంగ్రెస్ 40 మంది శాసనసభ్యులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు ఆ ముగ్గురు ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. ముగ్గురు స్వతంత్ర ఎంఎల్‌ఎలు ఆరుగురు కాంగ్రెస్ రెబెల్ ఎంఎల్‌ఎలతో పాటు క్రితం నెల రాజ్యసభ ఎన్నికలలో బిజెపి అభ్యర్థికి అనుకూలంగా వోటు వేశారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com